
ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 32.0
కనిష్ఠం 22.4
****

ANDHRAJYOTHY



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.50 (307.5790)	65,930	44,149
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	2,558.31	1,062.79
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.8982 (42.5720)	27,571	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

'ఫిలిప్పీన్స్'కి ఎగుమతుల్లో...
ఛాన్స్ దక్కేనా?



- గత ఏడాది జిల్లా నుంచి నామమాత్రంగానే
- టెండర్ ధాన్యానికి ఎగుమతులకు లింక్‌తో దూరమైన అవకాశం
- ఈసారి అవకాశం ఇవ్వాలంటున్న మిల్లర్లు

నల్లగొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విదేశాలకు బియ్యం ఎగుమతుల్లో నల్లగొండ జిల్లాకు తగిన స్థానం దక్కడం లేదు. రైస్‌బౌల్ ఆఫ్ ఆసియాగా పేరుగాంచినా, రాష్ట్రంలోనే అత్యధిక వరి దిగుబడి, అత్యధిక రైస్‌మిల్లులు ఉన్నా ఎగుమతులకు వచ్చేసారికి ఆస్థాయి ప్రాధాన్యం కరువవుతోంది. గత ఏడాది ఫిలిప్పీన్స్‌కు రాష్ట్రం నుంచి 2.5లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం ఎగుమతికి ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా ఇప్పటివరకు ఎగుమతి చేసిన 50వేల మెట్రిక్‌టన్నుల్లో నల్లగొండ జిల్లా నుంచి కేవలం 500మెట్రిక్‌టన్నులకే అవకాశం దక్కింది. తెలంగాణ సోనా రకం బియ్యం రవాణా చేస్తుండడం, టెండర్ వేసి విక్రయించిన బియ్యం నుంచే ఎగుమతులు చేయాలనే నిబంధన విధించడంతో జిల్లాకు ఎగుమతుల అవకాశం దక్కలేదని తెలుస్తోంది. తాజాగా ఈ ఏడాది సైతం ఫిలిప్పీన్స్‌కు మరో 2లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతికి అవకాశం వచ్చిన నేపథ్యంలో ఈసారైనా జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వాలని మిల్లర్లు కోరుతున్నారు.

టెండర్ బియ్యం లింక్‌తో దక్కని ఛాన్స్

గత ఏడాది ఫిలిప్పీన్స్ దేశానికి ఎగుమతి నిమిత్తం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ పలు రకాల బియ్యాన్ని పరిశీలించింది. సాంబమసూరి, తెలంగాణ సోనా, జైశ్రీరామ్, తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్), గంగాకావేరీ, పూజగోల్డ్ రకాలను, దొడ్డుబియ్యానికి సంబంధించి 1010 రకాలను పరిశీలించారు. ఫిలిప్పీన్స్ ప్రతినిధులు ఎంపికచేసిన వాటిలో తెలంగాణసోనా,ఎంటీయూ 1010 రకాల నుంచి బియ్యం ఎగుమతి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఎగుమతి చేసిన బియ్యానికి టెండర్ వేసింది.దానికి సంబంధించిన ధాన్యం నుంచే బియ్యం ఇవ్వాలని నిర్ణయించడంతో జిల్లాకు ప్రాధాన్యం లేకుండా పోయింది. జిల్లాలో ధాన్యం నిల్వలకు టెండర్‌వేసినా, ఆ ధాన్యంలో సరిపడా వెనక్కి రాకపోవడంతో మిల్లర్లు జిల్లా నుంచి ఎగుమతికి బియ్యం అందించలేకపోయారు.ఈసారి ఎగుమతికి పాత నిబంధనలే కొనసాగిస్తారా? లేక మార్పులు చేస్తారా? అనే విషయం తేలాల్సి ఉంది. ఈ నిబంధనలు మార్చాలని,ఎగుమతుల విషయంలో ప్రభుత్వం అందరికీ అవకాశం కల్పించాలని మిల్లర్లు కోరుతున్నారు. టెండర్ ధాన్యం వసూలు చేయడంలో ప్రభుత్వానికి స్వేచ్ఛ, అధికారం ఉందని అదే సమయంలో ఎగుమతులకు వాటికి లంకె పెట్టడంతో కీలక ఎగుమతుల విషయంలో జిల్లా అవకాశం కోల్పోవాల్సి వస్తోందని అంటున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక వరి దిగుబడితో పాటు అత్యంత నాణ్యమైన బియ్యం ఇక్కడ ఉత్పత్తి అవుతోందని, ఇలాంటి ప్రాంతంలో లభించే బియ్యాన్ని ఎగుమతి చేస్తే విదేశాల్లోనూ పేరువస్తుందని పేర్కొంటున్నారు. ఈ ఏడాది బియ్యం ఎగుమతి విషయంలో ప్రభుత్వం పునరాలోచించి అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



● నేడు వరలక్ష్మీ వ్రతం

శ్రావణమాసం మహిళలకు ప్రీతికరమైనది. ఈ మాసంలో వరలక్ష్మీ అమ్మవారిని కొలుస్తుంటారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలతో ఆలయాల్లో సందడి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్ర ముహూర్తం కావడంతో శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఆచరించడం ఆనవాయితీ. అందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి.

6

ఇసుకను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ భవిష్‌మిశ్రా



శాండ్ బజార్‌ను ప్రారంభిస్తున్న మైనింగ్ ఎండీ భవిష్ మిస్రా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం శాండ్ బజార్ నుంచి సరఫరా చేస్తున్న ఇసుకను భవన నిర్మాణ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ భవిష్‌మిశ్రా అన్నారు. గురువారం మిర్యాలగూడ చింతపల్లి ఇందిరమ్మ కాలనీ ఎక్స్ రోడ్డులో ఏర్పాటు చేసిన శాండ్‌బజార్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాండ్‌బజార్ సైట్‌ను ఓపెన్ చేసి ఇసుకను బుక్ చేసుకోవచ్చని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పాటు ఇతర వినియోగదారులు సైతం శాండ్‌బజార్ ఇసుకను వినియోగించుకోవచ్చని అన్నారు. ఇసుక అక్రమ దందాను అరికట్టి సామాన్యులకు అందుబాటు ధరలో ఇసుకను అందించడమే సాండ్‌బజార్ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. అందులో భాగంగానే సాండ్‌బజార్ ఏర్పాటు చేసి ఇసుకను తక్కువ ధరకు అందిస్తుందని తెలిపారు. సిమెంట్‌ను బస్తాకు రూ.50చొప్పున, ఇటుకలను మార్కెట్ ధర కంటే రూపాయి తక్కువగా అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మొదటి లబ్ధిదారునికి ఎమ్మెల్యే బీఎల్ఆర్ కాంటావేసి ట్రాక్టర్ నడిపి ఇసుక సరఫరా చేశారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ జాకోబ్, తహసీల్దార్ సురేష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బాలు, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ఇక చౌక



మిర్యాలగూడలోని శాండ్‌బజార్

ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే ఇసుకను ఇసుక బజార్ ద్వారా పంపిణీకీ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇసుక కొరత సమస్యను తీర్చి ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో నెరవేర్చేందుకు చర్యలు ప్రారంభించారు.
- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ)

ప్రభుత్వం నిరుపేదలకు గూడు కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. అందుకు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.5లక్షలు నిర్మాణాన్ని బట్టి దశల వారీగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తోంది. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తున్నా, ఇంటి నిర్మాణానికి కావల్సిన ఇసుక, సిమెంట్ సకాలంలో అందక పనులు సకాలంలో పూర్తికావడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ దశలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సరిపడా ఇసుకను సరఫరా చేసేందుకు అధికారులు మిర్యాలగూడలోని చింతపల్లి ఇందిరమ్మ కాలనీ క్రాస్‌రోడ్ వద్ద బైపాస్ సమీపంలోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో శాండ్‌బజార్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి చౌకగా ఇసుకను పంపిణీ చేయనున్నారు.

» ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సత్వర పూర్తికి శాండ్‌బజార్ » తక్కువ ధరలో తక్షణ సదుపాయం

తక్కువ ధరకే ఇసుక...

ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే ఇంటికే రవాణా చేసేందుకు సుమారు రెండు నుంచి మూడు రోజులు పడుతోంది.దూరాన్ని బట్టి ట్రాక్టర్ ట్రక్కు ఇసుక ధర రూ.4వేల నుంచి రూ.5వేల వరకుఉంది. దీనికి తోడు ఇసుక నాణ్యతలోనూ తేడాలుంటున్నాయి. అర ట్రక్కు అవసరమైన చోట పూర్తి ట్రక్కును కొనుగోలు చేయాల్సి వస్తోంది. పేదలకు ఈ ఇబ్బందులు తొలగించి అవసరమైన మేర చౌకధరకు ఇసుక బజార్ల ద్వారా విక్రయించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. టన్ను ఇసుకను రూ.1230కే విక్రయిస్తున్నారు. ట్రక్కులో 3 టన్నుల ఇసుక రవాణా చేయవచ్చు. దీంతో ట్రక్కు ఇసుక రూ.3690కే లభిస్తుండటంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకునే వీలు కలుగుతుంది. మిర్యాలగూడ నియోజకవర్గంలోని పేదలకు తొలుత 3,500, వితంతు, దివ్యాంగులకు 1500, మొత్తం 5వేల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. స్థానిక శాండ్‌బజార్ ద్వారా 5వేల మంది లబ్ధిదారులకు తక్షణ ప్రయోజనం చేకూరనుంది.

ఉమ్మడి జిల్లాలో ప్రథమం...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇసుక బజార్ ఏర్పాటులో మిర్యాలగూడలో ప్రథమం. రాష్ట్రంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో నాలుగు శాండ్ బజార్లు ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహిస్తున్నారు. అక్కడ టన్ను రూ.1600 చొప్పున విక్రయిస్తుండగా, మిర్యాలగూడలో మాత్రం టన్ను రూ.1230కే విక్రయిస్తున్నారు. ఇసుక చౌకగా లభిస్తుండటంతో ఇళ్ల నిర్మాణ యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శాండ్‌బజార్‌కు

- మిగతా 8వ పేజీలో...

జిల్లాలో జ్వర సర్వే

» సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి » కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి.

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జ్వర సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం గుడిపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజులకు మించి జ్వరం వస్తుంటే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యకేంద్రంలోని వైద్యులు, సిబ్బంది, హాజరు రిజిస్టర్, ఓపీ రిజిస్టర్, మందుల స్టాక్ రిజిస్టర్ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమె వెంట దేవరకొండ ఆర్డీవో వెంకటరమణారెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాస్ రావు, ఎంపీడీవో చంద్రమౌళి ఉన్నారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

నల్లగొండ టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షించారు. వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. ఆగస్టు 15న ఉదయం 9 గంటలకు పోలీస్ పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య వేడుకలు మొదలవుతాయని, ముఖ్యఅతిథి జాతీయ పతాకావిష్కరణ, వందన స్వీకరణ, సందేశం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, స్టాల్స్ తదితరాలు ఉంటాయని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


క్షయ వ్యాధిగ్రస్థులు పోషకాహారం తీసుకోవాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



టీబీ రోగులకు పోషకాహారాన్ని పంపిణీచేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిగ్రస్థులు మందులతో పాటు పోషకాహారం తీసుకోవాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఐఎంఏ భవనంలో బంగారుగడ్డ, ప్రకాష్‌నగర్ అర్బన్ పీహెచ్‌సీల పరిధిలోని క్షయ(టీబీ) రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కుటుంబ ఆరోగ్య సర్వేలో గుర్తించిన రోగులకు సమీప పీహెచ్‌సీల నుంచి ప్రతీ నెలా మందులు అందించనున్నట్లు తెలిపారు. టీబీ రోగులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు పోషకాహారం అందించడంతో తమ వంతు చేయూతనివ్వాలని కోరారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న టీబీ రోగుల ఆరోగ్యస్థితిని పరిశీలించి డాక్టర్ల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ఆరోగ్య సిబ్బంది తమ వంతు కృషి చేయాలని అన్నారు. డెంగ్యూ, విషజ్వరాల కేసులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం క్షయ రోగులకు పోషకాహార బుట్టలు అందించేందుకు ముందుకొచ్చిన బ్రౌస్, స్వధర్మ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను డీఎంహెచ్‌వో అభినందించారు. కార్యక్రమంలో క్షయ నిర్ధారణ జిల్లా అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, వైద్యులు డాక్టర్ నిపుణ్, డాక్టర్ జానకిరాములు, సూపర్‌వైజర్లు ప్రమీల, సృజన, సోములమ్మ, తదితరులు పాల్గొన్నారు.



● వర్షం

జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలిలో కురుస్తున్న వర్షం

నల్లగొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. శాలిగౌరారంలో 13.6సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరి, పండ్ల తోటలు, పత్తి చేలకు ఈ వర్షం ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తుంది. వర్షాలకు పానగల్ కూడలి వద్ద భారీగా వరద నిలిచింది.

'భూభారతి' దరఖాస్తులను పరిశీలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భూభారతి అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. నల్లగొండ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నల్లగొండ డివిజన్‌లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో గురువారం భూభారతి రెవెన్యూ సదస్సులపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు, డీటీలు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ప్రోత్సాహం

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత జౌళిశాఖ అధికారులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు ద్వారక్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం జిల్లా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులను సన్మానించారు. త్రిఫ్ట్ ఫండ్ హ్యాండ్లూమ్ పథకం కింద రూ. 29కోట్లు, పవర్ లూమ్ త్రిఫ్ట్ కింద రూ.11కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి అధికారి ప్రసాద్, సహాయ అభివృద్ధి అధికారులు గీతారాణి, గోపాల్, చేనేత సంఘం నాయకులు అంజనేయులు, నరసింహ పాల్గొన్నారు.

సింహవాహినీ దేవిగా ఎల్లమ్మతల్లి

ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



కనగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని అమ్మవారు భక్తులకు గురువారం సింహవాహినీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ముఖ్య అర్చకులు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి శ్రీదేవి ఖడ్గమాల నామవాళితో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీర సారె ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

అనకాపల్లి టూ ఢిల్లీ

రెండు కార్లలో పట్టుబడిన 250కిలోల గంజాయి ● విలువ రూ.70లక్షలు

6

ముర్రుపాలతో శిశువులకు ఆరోగ్యం

జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

చిట్యాలరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ముర్రుపాలతో శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. చిట్యాల మండలం నేరడ, వనిపాకల గ్రామాల్లో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. పుట్టిన బిడ్డకు వెంటనే వచ్చే ముర్రుపాలలో ఉండే కొలస్ట్రీన్ పదార్థంతో బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని అన్నారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, సిబ్బంది హేమ, విజయ, అలివేలు మంగ, సుజాత, జ్యోతి, నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ పోయినా చింతెందుకు..

» సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఎక్కడుందో గుర్తింపు » ఈ ఏడాది 1,376 ఫోన్లకు 710 స్వాధీనం, అప్పగింత

రంగారావు కుమారుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాడు. మొదటి వేతనంతో రూ.50 వేలు వెచ్చించి ఓ కొత్త ఫోన్‌ను తండ్రికి బహుమతిగా ఇచ్చాడు. ఒక రోజు ఆయన సెల్‌ఫోన్‌ను ఎక్కడో పోగొట్టుకున్నాడు. కుమారుడు ప్రేమతో బహుమతిగా ఇచ్చింది, అందునా రూ.వేలు ఖర్చు చేసి కొన్నది కావడంతో దిగాలు చెందాడు. ఫోన్ కొనుగోలు చేసిన బిల్లు చూపించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ ద్వారా ఫోన్ ఎక్కడుందో కనిపెట్టి అప్పగించారు. దీంతో రంగారావు ఆనందానికి హద్దుల్లేకుండాపోయాయి. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాదిలో 1,367 ఫోన్లు పోగా 710 ఫోన్లను పోలీసులు బాధితులకు అప్పగించారు.

– (ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)



ఫోన్లను రికవరీ చేసి యజమానులకు అందజేస్తున్న ఎస్పీ(ఫైల్)

ప్రస్తుత సాంకేతిక యుగంలో సెల్‌ఫోన్ ప్రతి ఒక్కరికీ ఎంతో ప్రధానమైనది. ప్రస్తుత సమాజంలో ఫోన్ లేని వారు చాలాఅరుదు. చిన్నారులు, కొంతమంది వృద్ధులను మినహాయిస్తే అందరూ ఫోన్ వాడుతున్నారు. వారి వారి స్థోమతకు తగిన వివిధరకాల కంపెనీల ఫోన్లు వినియోగిస్తున్నారు. ఇందుకోసం రూ.వేల నుంచి రూ.లక్షల వరకు వెచ్చిస్తున్నారు. ఫోన్ మాట్లాడుకోవడానికే కాకుండా ఇతరత్రా అవసరాల తీర్చేందుకూ ఉపయోగపడుతోంది. అధునాతన సాంకేతికతతో కూడిన ఫోన్లలో వ్యక్తిగత బ్యాంక్ సంబంధిత వివరాలు, డ్రైవింగ్, ఆధార్, సర్టిఫికెట్లు, ఇతరత్రా సమాచారాలను నిక్షిప్తం చేసుకునే వీలుంటుంది. అలాగే వివిధ సందర్భాల్లో తీసుకున్న ఫొటోలు, డాక్యుమెంట్లు ఇలా ఎన్నో అవసరాలు ఫోన్‌తో ముడిపడి ఉన్నాయి. అంతేకాకుండా ఇటీవల ప్రతి ఒక్కరూ వ్యాపార లావాదేవాలను సైతం గూగుల్ పే, ఫోన్ పే వంటి ద్వారా కొనసాగిస్తున్నారు. దీంతో ఫోన్ వినియోగం అనేది అనివార్యమైంది. అయితే ఆయా ఫోన్లను కొందరు దొంగలు చోరీ చేస్తుండగా, మరికొన్ని సందర్భాల్లో అజాగ్రత్తతో పోగొట్టుకుంటున్నారు. ఫోన్లు దొరికిన వారు కొందరు తిరిగి యజమానులకు అప్పగిస్తుండగా, దొంగలు మాత్రం ఇతరులకు తక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఫోన్ పోతే ఇబ్బందులే...

సెల్‌ఫోన్లు పోయిన సమయాల్లో అందులో భద్రపరిచిన వివరాలు, నెంబర్లు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. దీంతో కొంత ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. చోరీచేసిన ఫోన్లతో లావాదేవీలు నడిపి బాధితుల బ్యాంక్ ఖాతాలు కొల్లగొట్టిన సందర్భాలూ ఉన్నాయి. వీటన్నింటికీ దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్‌ను తెచ్చింది. పోయిన ఫోన్లను రాబట్టేందుకు ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్)పోర్టల్‌లో నమోదు చేస్తే సరిపోతుంది. పోయిన ఫోన్‌ను ఎవరైనా వినియోగిస్తే వెంటనే సమాచారం పోలీసులకు తెలిసిపోతుంది.

పోర్టల్‌లో నమోదు చేయాలి

ఏదైనా సందర్భంలో సెల్‌ఫోన్ చోరీకి గురైనా, అజాగ్రత్తతో పోయినా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంది. సంబంధిత పోర్టల్‌లోకి వెళ్లగానే రిక్వెస్ట్ ఫర్ బ్లాకింగ్ లాస్ట్, స్టోలెన్ మొబైల్ లింక్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. అందులో సెల్‌ఫోన్‌కు సంబంధించిన 15 డిజిట్స్ ఐఎంఈఐ నెంబరు, ఫోన్ కంపెనీ పేరు, మోడల్ పేరు, కొనుగోలు చేసిన బిల్లును నమోదు చేయాల్సి ఉంది. తర్వాత ఓటీపీ కోసం మరో సెల్‌ఫోన్ నెంబరు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ వివరాలను నమోదు చేసిన తర్వాత ఫిర్యాదుదారుడికి ఐడీ నెంబరు వస్తుంది. అనంతరం ఆ మొబైల్ పని చేయకుండా చేస్తుంది. ఏ కంపెనీ సెల్‌ఫోన్ అయినా సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయగానే బ్లాక్ అవుతుంది. ఇక దానిని ఎవరు వినియోగించలేరు. దీంతో పాటు ఫోన్ ఎక్కడ ఉందనే వివరాలు పోలీస్ శాఖలోని ఐటీ సెంటర్‌కు అందుతుంది. దీంతో ఐటీ సెల్ పోలీసులు పోయిన ఫోన్‌ను రికవరీ చేస్తారు. ఫోన్‌పోయిన సందర్భంలో మీసేవా కేంద్రాల్లో అయినా, పోలీస్‌స్టేషన్‌లో అయినా నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

జిల్లాలో 1,367 ఫిర్యాదులు

జిల్లా పరిధిలో ఈ ఏడాదిలో ఫోన్లు పోయినట్లు సీఈఐఆర్ పోర్టల్‌లో 1,367 మంది ఫిర్యాదులు వచ్చాయి. ఆ ఫిర్యాదులపై ఐటీ సెల్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటివరకు 710 ఫోన్లను స్వాధీనం చేసుకుని ఫోన్ల యజమానులకు అప్పగించింది. గతంలో ఫోన్లు పోతే తిరిగి లభించడం చాలాకష్టంగా ఉండేది. ఏదైనా కేసుకు సంబంధించిన సీడీఆర్‌లో ఫోన్ వివరాలు నమోదు చేస్తే, ఆ ఫోన్‌ను ఎవరైనా వినియోగిస్తే అప్పుడు కానీ పట్టుకునే వారు. చాలామంది ఫోన్లు పోయినప్పుడు చేసేది లేక కొత్త ఫోన్లు కొనుగోలు చేసేవారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలులోకి తెచ్చిన సీఈఐఆర్ పోర్టల్‌తో ఇబ్బందులు తొలగిపోయాయి.

పాతఫోన్లను కొనుగోలు చేయొద్దు



పాతఫోన్లను ఎలాంటి రశీదు లేకుండా కొనుగోలు చేయవద్దు. ఎక్కువగా పాతఫోన్లు చోరీ చేసినవి ఉంటాయి. అలాంటి ఫోన్లను కొనుగోలు చేస్తే పోలీసులకు పట్టుబడతారు. ఫోన్లు పోతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేయాలి. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన ఫోన్‌ను రికవరీ చేసే అవకాశం ఉంది.

– కొత్తపల్లి నర్సింహ, ఎస్పీ

అనకాపల్లి టూ ఢిల్లీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

చిట్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనకాపల్లి నుంచి ఢిల్లీకి గంజాయిని కార్లలో తరలిస్తున్న ముఠా గుట్టును నల్లగొండ జిల్లా పోలీసులు రట్టు చేశారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ ముఠా సభ్యుడిని అరెస్టుచేసి 250కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గురువారం చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ డీఎస్పీ శివరాం రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నల్లగొండ జిల్లా చిట్యాల పోలీసులు గురువారం తెల్లవారుజామున 65వ నెంబరు జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. పట్టణంలోని సుజన థియేటర్ సమీపంలో ఢిల్లీ నెంబర్ ప్లేట్ ఉన్న కారు హైదరాబాద్ వైపు వెళుతుండటంతో కారు ఆపి లోపల ఉన్న ముగ్గురిని పోలీసులు ప్రశ్నించారు. ఇద్దరు అక్కడినుంచి పారిపోగా, ఒకరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించటంతో తమకు సంబంధించిన మరో కారు వెనుకగా వస్తుందని సమాచారమిచ్చాడు. ఆ మేరకు వచ్చిన కారును ఆపేందుకు ప్రయత్నించగా విజయవాడ వైపు వేగంగా వెళ్లిపోయి కట్టంగూరు మండల పరిధిలో చెట్ల పొదల్లో వదిలి పరారయ్యారు. పట్టుబడిన వ్యక్తిని విచారణ చేయగా తన పేరు నూర్ మహ్మద్‌గా అని, పారిపోయిన ఇద్దరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన బబ్లూ, మంగల్, ఢిల్లీకి చెందిన జమీల్, ఖాను, కన్హాయి అధికారిగా సమాచారమిచ్చాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి గంజాయి తీసుకురావాలని ఢిల్లీకి చెందిన మొనీస్ అలియాస్ రాహుల్ మిశ్రా మూడు కార్లు ఇచ్చి పంపారని, ఇందుకోసం ఒక్కొక్కరికి రూ. 20వేలు ఇస్తారని తెలిపారు. రెండు కార్లలో గంజాయి ప్యాకెట్లు సర్దుతామని, ఒక కారు తమను అనుసరిస్తూ వస్తుందని చెప్పాడు. తామంతా కలిసి ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి ప్రాంతానికి వెళ్లి గంజాయి ప్యాకెట్లను కార్లలో సర్దుకుని ఢిల్లీకి వెళ్లి నిర్ణీత ప్రదేశంలో కారు నిలుపుదల చేసి వెళ్లిపోతామని పోలీసులకు తెలిపాడు. తనిఖీల్లో పట్టుబడిన రెండు కార్లను తనిఖీచేసి వాటిలో ఉన్న 250 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ సుమారు రూ.70లక్షలు ఉంటుందని డీఎస్పీ శివరాంరెడ్డి తెలిపారు. 250కిలోల గంజాయితో పాటు రెండు కార్లు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. గంజాయి పట్టుకున్న సంఘటనలో చురుకుగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు మల్లేష్, వెంకన్నను అభినందించారు. విలేకరుల సమావేశంలో సీఐ నాగరాజు, ఎస్ఐ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఆరుగురిపై కేసు నమోదు

ఆత్మకూరు(ఎస్) / కనగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో గంజాయి సేవిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించి సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్)లో డీఎస్పీ ప్రసన్నకుమార్ వివరాలు వెల్లడించారు. పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ఏనుబాముల సమీపంలో అనుమానస్పందంగా ఇద్దరు వ్యక్తులు కనిపించడంతో విచారణ చేయగా గంజాయి సేవిస్తున్నట్లు తెలిపారు. గట్టికల్ గ్రామానికి చెందిన మడ్డి అయోధ్య, నెమ్మికల్‌కు చెందిన పాతులోతు రిత్విక్‌రాథోడ్ కలిసి గంజాయి సేవిస్తున్నట్లు తెలిపారు. వారి వద్ద దొరికిన 108గ్రాముల గంజాయిని, బైక్, రెండు సెల్ ఫోన్లను సీజ్ చేసి ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో గంజాయి సేవిస్తున్న నలుగురిని పట్టుకున్నట్లు ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ పట్టణానికి చెందిన ఇమ్రాన్ రిజ్వాన్ సూర్యకిరణ్‌తో పాటు అనుముల మండలం మారెపల్లికి చెందిన ఇర్ఫాన్‌లు అమ్మగూడెం స్టేజీ వద్ద అనుమానాస్పద రీతిలో కనిపించగా స్థానికుల సమాచారం మేరకు అక్కడికి వెళ్లగా గంజాయి తాగుతూ పట్టుబడ్డారని తెలిపారు. చండూరు సీఐ ఆదిరెడ్డి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి యువకులను రిమాండ్‌కు తరలించామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మద్దిరాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం పోలుమళ్ల గ్రామంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ఎస్ఐ వీరన్న తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అర్పిరాల గ్రామానికి చెందిన వల్లపు సోమనర్సమ్మ(75) తల్లిగారి ఇల్లు పోలుమళ్ల గ్రామానికి ఆర్టీసీ బస్సులో వచ్చింది. ఆమె రోడ్డు దాటుతుండగా దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన కేతం రాజు కారును అతివేగంగా నడుపుతూ సోమనర్సమ్మ ఢీకొట్టాడు. ప్రమాదంలో సోమనర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని తుంగతుర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. సోమనర్సమ్మ మనవడు వల్లపు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వీరన్న తెలిపారు.

ఖమ్మం జిల్లాలో ఎన్నెస్పీ వర్క్‌ఇన్‌స్పెక్టర్


హుస్సేన్(ఫైల్)

కూసుమంచి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా పాలేరు జలాశయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎన్నెస్పీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మృతి చెందారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం బేతవోలు గ్రామానికి చెందిన బండ్ల హుస్సేన్(58) ద్విచక్రవాహనంపై హుస్సేన్ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొట్టింది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. హుస్సేన్ మృతికి నీటిపారుదలశాఖ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

శంభులింగేశ్వరస్వామి ఆలయంలో చోరీ


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

నార్కట్‌పల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ఏపీ లింగోటం గ్రామ కూడలిలోని శంభులింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ క్రాంతికుమార్, గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ కూడలిలోని శంభులింగేశ్వరస్వామి ఆలయాన్ని తెరిచేందుకు అర్చకుడు ఎల్లాప్రగడ వెంకటేశ్వరశర్మ గురువారం తెల్లవారుజామున వచ్చారు. ఆలయ పరిసరాల్లో హుండీ పక్కకు పడవేసి ఉండటం, గర్భాలయానికి ఉన్న ఇనుపజాలి ద్వారాలకు వేసిన తాళం ధ్వంసమై ఉండటాన్ని గమనించి సమాచారాన్ని గ్రామస్థులకు తెలిపాడు. చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలంలో క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. సుమారు 4 తులాల విలువైన బంగారు పుస్తెలు ఇతర ఆభరణాలు, శంభులింగేశ్వర స్వామికి అలంకరించే వెండి ఆభరణాలు షటారి, పూజాపాత్రలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటితో పాటు భక్తులు కానుకల రూపంలో హుండీలో సమర్పించిన సుమారు రూ.40,000ల నగదును కూడా చోరీ చేశారు. కాగా బుధవారం అర్ధరాత్రి ఆలయ సమీపంలో గుర్తుతెలియని ముగ్గురు యువకులు సంచరించిన దృశ్యాలు ఆలయ పరిసరాల్లోని గ్రామస్థుల నివాసాల్లోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పోరెడ్డి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ దగ్గుల క్రాంతికుమార్ ఎస్ఐ తెలిపారు.

అనర్హులకు కల్యాణలక్ష్మి అమలుపై కలెక్టర్ ఆగ్రహం

పాలడుగు కార్యదర్శి, మోత్కూరు ఆర్ఐ సస్పెన్షన్

మోత్కూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో అనర్హులకు కల్యాణలక్ష్మి పథకం వర్తించడంపై కలెక్టర్ హనుమంతరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి గ్రామ కార్యదర్శి శోభన్, మోత్కూరు ఆర్ఐ దాసరి శ్రీనివాస్‌లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పదేళ్ల కిందట వివాహమైన పాలడుగు గ్రామానికి చెందిన మహిళకు కల్యాణలక్ష్మి వర్తింపజేశారు. రూ.లక్షా 116ల చెక్కును జూలై చివరి వారంలో ఆమె తల్లి తీసుకుంది. విషయం బయటకు వచ్చి కలెక్టర్ హనుమంతరావు దృష్టికి వెళ్లడంతో విచారణకు ఆదేశించారు. ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ జ్యోతి ఈ నెల 1న గ్రామానికి వెళ్లి విచారించి నివేదికను ఆర్డీవోకు అందించింది. ఈ నేపథ్యంలో అనర్హురాలికి కల్యాణలక్ష్మి పథకం మంజూరుకు కారకులైన పైరవీకారులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు, ఎస్సీ, ఎస్టీ విజిలెన్సు అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేష్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో కల్యాణలక్ష్మి చెక్కు తీసుకున్న లబ్ధిదారు వల్లపు సోమలక్ష్మీ నుంచి తహసీల్దార్ డబ్బులు రికవరీ చేశారు. తహసీల్దార్, ఆర్డీవోల నివేదికల మేరకు పంచాయతీ కార్యదర్శి శోభన్, ఆర్ఐ శ్రీనివాస్ సమగ్ర విచారణ జరుపకుండానే కల్యాణలక్ష్మి పథకం మంజూరుకు కారణమయ్యారని కలెక్టర్ వారిద్దరిని సస్పెండ్ చేశారు.

కర్మకాండలకు వెళ్లి వస్తూ వాగులో పడి మృతి

ఆత్మకూరు(ఎస్), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బంధువుల దశదినకర్మలకు వెళ్లి వాగులో పడి మహిళ మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం ఏపూరు శివారులో గురువారం జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం నూతనకల్ మండలం మిర్యాల గ్రామానికి చెందిన పచ్చిపాల నాగమ్మ(45) ఈ నెల 4న మోతె మండలం సర్వారం గ్రామంలో బంధువుల దశదినకర్మకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో ఏపూరు గ్రామ శివారులోని పాలేరు వాగులో కాలకృత్యాల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు వాగులో పడి చనిపోయినట్లు తెలిపారు. గురువారం స్థానికులు చూసి సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని తీశామన్నారు. నాగమ్మ కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

● చదువుతో ఉన్నతంగా ఎదగాలి


తుంగతుర్తి: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ సందర్శించారు. కొద్దిసేపు టీచర్‌గా వ్యవహరించారు. విద్యార్థులతో మాట్లాడారు.

● బాగా చదివి నాలా కలెక్టర్ కావాలి


పీఏపల్లి: నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని దుగ్యాల తెలంగాణ ఆదర్శ పాఠశాలను కలెక్టర్ ఇలా త్రిపాఠి సందర్శించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కష్టపడి చదివి తనలా కలెక్టర్ కావాలని సూచించారు.

వివాహిత ఆత్మహత్య: మృతిపై బంధువుల అనుమానం

కోదాడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలోని చెరువుబజార్‌కు చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. కోదాడ సీఐ శివశంకర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెరువుబజార్‌కు చెందిన ఉప్పుతల లక్ష్మి(40) భర్త శ్రీనివాసుతో నెలకొన్న తగాదాల నేపథ్యంలో బుధవారం రాత్రి ఉరివేసుకుంది. తెల్లవారుజామున కుటుంబ సభ్యులు గమనించినట్లు సీఐ తెలిపారు. లక్ష్మికి భర్తతో పాటు ఇద్దరు పిల్లలు ఉండగా కుమార్తె హాసిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా లక్ష్మిని భర్త శ్రీనివాస్ కొన్నేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని లక్ష్మి బంధువులు అన్నారు. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించినట్లు బంధువులు ఆరోపించారు.

మేజర్‌కాల్వలో మునిగి జూనియర్ అసిస్టెంట్ మృతి


అంజద్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మేజర్ కాల్వలో ఈతకు వెళ్లి సుడిగుండంలో చిక్కుకొని ఓ జూనియర్ అసిస్టెంట్ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం కాల్వలపల్లి మేజర్ కాల్వలో గురువారం జరిగింది. స్థానికులు, రూరల్ ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డకు చెందిన అంజద్ దేవరకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గురువారం తన స్నేహితుడైన నాగుల్‌తో కలిసి కాల్వపల్లి మేజర్ వద్దకు వెళ్లారు. మేజర్‌కాలువ తూము సమీపంలో ఈత కొడుతూ సుడిగుండాల్లోకి వెళ్లిన అంజద్ నీట మునిగి ఊపిరాడక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అయితే కాల్వలో నీటి ప్రవాహం ఐదు అడుగుల కంటే తక్కువగా ఉన్నప్పటికీ అంజద్ మృతి చెందడంపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంజద్‌కు ఇద్దరు పిల్లలు ఉండగా, భార్య ఆసియాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

వరలక్ష్మీదేవి రావమ్మా...

● ఆలయాల్లో శ్రావణమాస సందడి



(ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్ / మిర్యాలగూడ టౌన్ / నిడమనూరు)

ఆలయాల్లో శ్రావణమాస సందడి కనిపిస్తోంది. ముఖ్యంగా మహిళలు ఈ మాసంలో వారికి ప్రీతిపాత్రమైన వరలక్ష్మీ అమ్మవారిని కొలుస్తుంటారు. మొదటి రోజు నుంచే అర్చనలు, అభిషేకాలతో సోమ, శుక్రవారాల్లో ఉపవాసాలు ఉంటుంటారు. శనివారాల్లో ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అమ్మవారి విగ్రహాలను అలంకరించి భక్తిశ్రద్ధలతో నోమితో కోరికలు తీరుతాయని మహిళల నమ్మకం. అమ్మవారిని పూజిస్తే సిరి సంపదలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ నేపథ్యంలో సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్ర ముహూర్తం కావడంతో శుక్రవారం రోజులు ప్రత్యేక అభిషేకాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. అదేవిధంగా ఈ మాసం అత్యంత ప్రధానమైన రెండో శుక్రవారం నిర్వహించే వరలక్ష్మీ వ్రతం నిర్వహణకు ఆలయాలు ముస్తాబయ్యాయి.


● నేడు వరలక్ష్మీవ్రతం

మార్కెట్‌కు 'శ్రావణ' శోభ

శ్రావణమాస పర్వదినాల్లో వరలక్ష్మీ వ్రతం ఎంతో ముఖ్యమైంది. మహిళల నోములకు ముఖ్యమైన మాసాల్లో ఈ మాసం ప్రథమం. ఎక్కువగా పూజలు, లక్ష్మీదేవి వ్రతాలు చేస్తుంటారు. దీంతో మార్కెట్ పండుగ శోభ సంతరించుకుంది. సందడి జోరుగా కనిపిస్తోంది. వరలక్ష్మీ వ్రతంలో మహిళలు బంగారు లక్ష్మీ కాసులతో(రూపులు)అమ్మవారిని పూజించడం ఆనవాయితీగా వస్తోంది. కనీసం చిన్న బంగారు కాసుతోనైనా పూజిస్తే అమ్మవారి కరుణా కటాక్షాలు కలిగి ఇంటా సిరులు కురుస్తాయని విశ్వాసం. దీంతో బంగారుకాసులు కొనేందుకు మహిళలు ఎంతో ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో అమ్మవారి బంగారు కాసులకు డిమాండ్ పెరిగింది.


నల్లగొండలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ముస్తాబైన ఆలయాలు



శ్రావణంలో ప్రతి రోజూ పండుగే. అలాంటిది వరలక్ష్మీ వ్రతం జరుపుకునే శ్రావణ శుక్రవారం మహిళలు పెద్దసంఖ్యలో పూజలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ఆలయాలు వేడుకలకు సిద్ధమయ్యాయి. మిర్యాలగూడలోని సరస్వతీ సమేత కనకదుర్గ ఆలయం, రుక్మిణీ సమేత శ్రీకృష్ణాలయం(గీతామందిర్)లలో సామూహిక వ్రతాలు జరిపేందుకు ప్రత్యేకఏర్పాట్లు చేశారు. శివాలయం, ఉమామహేశ్వరాలయాల్లో ప్రత్యేక శని పూజలు జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నల్లగొండ పట్టణంలోని వీటీకాలనీలోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయం, బీట్ మార్కెట్‌లోని శ్రీ రామకోటి స్థూప దేవాలయం, పలు దేవాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేశారు. కొన్ని ఆలయాల్లో చిన్నారులకు అక్షరఅభ్యాస కార్యక్రమాలను కూడా నిర్వహించనున్నారు.

పూలకు భలే గిరాకీ

వరలక్ష్మీ వ్రతాల పర్వదినం సందర్భంగా పూలకు డిమాండ్ పెరిగింది. ఉమ్మడి జిల్లాలో వివిధ ప్రాంతాలలో గురువారం సాయంత్రం వివిధ రకాల పూలను రాశులుగా పోసి విక్రయాలు జరిపారు. బంతి పూలు ఇలో రూ.160, చామంతి కిలో రూ.500, మల్లెపూలు కిలో రూ.1200, కనకాంబరాలు రూ.1200, కాగడ మల్లెపూలు రూ.800, గులాబీలు రూ.500, తోక బంతిపూలు రూ.250, విరజాజులు కిలో రూ.800, మూర పూలు రూ.50, మీటరు రూ.100 చొప్పున విక్రయాలు జరిగాయి. అదేవిధంగా దేవాలయాల ముస్తాబుకు కూడా ఆలయ కమిటీ నిర్వాహకులు పెద్ద ఎత్తున పూలను కొనుగోలు చేశారు.

గ్రామీణ వైద్యులు ప్రథమ చికిత్సకే పరిమితం కావాలి


క్లినిక్‌లో ఔషధాలు, ఇంజక్షన్లను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జయమనోహరి

మునగాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ వైద్యులు ప్రథమచికిత్స వరకే పరిమితం కావాలని, అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని సూర్యాపేట జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో జయమనోహరి అన్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలకేంద్రంలో గ్రామీణ వైద్యుడు చంద్రమౌళి నిర్వహిస్తున్న క్లినిక్‌లో చికిత్సపొందిన ఓ వ్యక్తి మూడురోజుల క్రితం మృతి చెందాడు. ఈ ఘటనపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఆమె విచారణ చేపట్టారు. క్లినిక్‌లో ఉపయోగిస్తున్న ఔషధాలను, ఇంజక్షన్లను, ల్యాబ్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 20 ఏళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ చికిత్సపొందిన వారిలో ఆరుగురు మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారన్నారు. విషయాలన్ని రికార్డు చేసి నివేదికను డీఎంహెచ్‌వోకు అందిస్తామన్నారు. ఆమె వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి రవీందర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలదాడిలో 80 గొర్రెలు మృతి

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో వీధికుక్కల దాడిలో 80 గొర్రెలు మృతి చెందాయి. గురువారం ఆలేరు పశువైద్యాధికారి చైతన్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు పట్టణానికి వనెలంగడి సంపత్ తన గొర్రెలను కాచారం గ్రామశివారులో ఉంచారు. ఈ నెల 6న అర్ధరాత్రి వీధికుక్కలు గొర్రెలమందపై దాడి చేయడంతో 80 గొర్రెలు మృతి చెందగా, మరో 20 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్, జిల్లా పశువైద్యాధికారికి పంపించనున్నట్లు చైతన్య తెలిపారు. ఆమెతో సిబ్బంది, గొర్రెలపెంపకందారుడు సంపత్, గ్రామస్థులు ఉన్నారు.

పిడుగుపాటుకు మూడు మేకలు..

మేళ్లచెర్వు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండల కేంద్రంలో పిడుగుపాటుకు గురై మూడు మేకలు మృతి చెందాయి. గురువారం హేమ్లాతండా సమీపంలో పొలాల్లో పిడుగుపాటుకు గురై రెండు, మేకలు, ఒక మేకపోతు మృతి చెందాయి. జీవాల విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

పోగు బతుకు భారం

● అర్ధాకలితో కాలం వెళ్లదీస్తున్న చేనేత కుటుంబాలు



పోగు బతుకు భారమవుతోంది. రోజంతా కష్టపడితే వచ్చే కూలితో పొట్ట నిండడం కష్టమవుతోంది. ఎన్నో చేనేత కుటుంబాలు అర్ధాకలితో కాలం వెళ్లదీస్తున్నాయి. వారసత్వ వృత్తిని, కళను కాపాడుకునేందుకు చేనేత కార్మికులు ఎంతో శ్రమిస్తున్నారు. మాస్టర్ వీవర్ వద్ద నూలు తెచ్చుకుని చీరెలు నేస్తున్నందున, తమకు కూలి మాత్రమే వస్తుందన్నారు. ఇక్కత్ హాండ్లూమ్ క్లస్టర్ కేంద్రానికి అనుబంధంగా రంగుల అద్దకం కేంద్రం ఏర్పాటు చేస్తే మరి కొందరికి ఉపాధి దొరకడంతో పాటు తమకు మరింత ఆదాయం పెరుగుతుందందని చేనేత కార్మికులు పేర్కొంటున్నారు.

● ఆంధ్రజ్యోతి - మోత్కూరు, యాదగిరిగుట్ట రూరల్

జీవితం భారంగా మారింది



సొసైటీల ద్వారా కాకుండా మాస్టర్ వీవర్స్ ద్వారా కూలితో జీవితం భారంగా మారింది. పని ఎక్కువ అవుతుంది. ఆదాయం తక్కువగా ఉంటుంది. భార్యభర్త ఇద్దరూ కష్టపడి పని చేస్తే నెలకు రూ.15వేలు మాత్రమే వస్తుంది. కుంటుంబం గడవడం కష్టంగా మారింది.

● బడుగు వెంకటేశ్, చేనేత కార్మికుడు యాదగిరిగుట్ట.

కుటుంబ భారం నాపై పడింది



15 సంవత్సరాల క్రితం భర్త మృతిచెందడంతో కుటుంబ భారం నాపై పడింది. మగ్గం పని చేస్తూ కూతురు, కుటుంబాన్ని పోషించుకుంటున్నా. ప్రస్తుతం మగ్గం నేయడం పెనుభారంగా మారింది. మాస్టర్ వీవర్స్ ద్వారానే వార్పు తేవడంతో నెలకు తక్కువ కూలి వస్తుంది. ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పించి సబ్సిడీలతో వార్పు ఇవ్వాలి

● దేవతల లత, చేనేత మహిళా కార్మికురాలు యాదగిరిగుట్ట

సొసైటీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి



12 సంవత్సరాలుగా సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. సహకార ఎన్నికలు వెంటనే నిర్వహించాలి. మాస్టర్ వీవర్స్ వద్దకాకుండా సొసైటీల ద్వారా వార్పు అందజేసి ఉత్పత్తులను టెస్కోల ద్వారా కొనుగోలు చేసి వెంటనే డబ్బులు ఇవ్వాలి. షరతులు లేకుండా మగ్గంనేసే ప్రతి కార్మికుడికీ బీమా సౌకర్యం కల్పించాలి.

● బి. మల్లేశం, చేనేత కార్మికుడు, యాదగిరిగుట్ట

ఇక్కత్ హ్యాండ్లూమ్ క్లస్టర్‌లో ఉపాధి పొందుతున్నా..



మాకు ఇంటి వద్ద మగ్గం ఉంది. దానిపై నేసినప్పుడు మూడు, నాలుగు రోజులకు ఒక చీర నేసేవాడిని. సుమారు మూడేళ్లుగా ఇక్కత్ హ్యాండ్లూమ్ క్లస్టర్‌లో మగ్గం నేస్తున్నాను. నెలకు సుమారు రూ.14వేల ఆదాయం వస్తుంది. ఇంటివద్ద ఉన్న మగ్గంపై నా భార్య నేస్తున్నది. ఆమె నెలకు సుమారు రూ.6వేలు సంపాదిస్తోంది. ఇలా కుటుంబాన్ని పోషించు కుంటున్నాం. ప్రభుత్వం వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు కొత్త డిజన్లపై తరుచూ శిక్షణ ఇవ్వాలి.

● పోచం రాజు, చేనేత కార్మికుడు, మోత్కూరు

బీసీ రిజర్వేషన్ల పేరుతో సీఎం డ్రామాలు



మాజీమంత్రి కేటీఆర్‌తో బీఆర్ఎస్ నాయకుడు దూదిమెట్ల బాలరాజుయాదవ్ తదితరులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి బీసీ రిజర్వేషన్ పేరుతో డ్రామాలు చేస్తోందని బీఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్‌పై చిత్తశుద్ధి లోపించిందనడానికి ఢిల్లీలో చేసిన ధర్నా కార్యక్రమమే నిదర్శనమని అన్నారు. కరీంనగర్‌లో ఈ నెల 14వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించ తలపెట్టిన బీసీ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ నాయకులు, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ గురువారం ఆయనను హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 14 నిర్వహించనున్న కరీంనగర్ సభకు పెద్ద ఎత్తున బీసీలను తరలించాలని కేటీఆర్ సూచించారు.

అసోసియేట్ ప్రొఫెసర్‌గా తండు కృష్ణకౌండిన్య

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): రామన్నపేట డిగ్రీ కళాశాల తెలుగు విభాగం అధిపతి, సాహితీ వేత్త తండు కృష్ణ కౌండిన్యను అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పిస్తూ విద్యాశాఖ కమిషనర్ దేవసేన గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణ కౌండిన్య ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన కౌండిన్యను కళాశాల ప్రధానాచార్యులు రహత్ ఖానాం, సాహితీ వేత్తలు కూరెళ్ల విఠలాచార్యులు, వేణు సంకోజు, మేరెడ్డి యాదగిరిరెడ్డి, పెరుమాళ్ల ఆనంద్, సాగర్ల సత్తయ్య, పెందోట సోములు, లింగమూర్తి, మాదగాని శంకరయ్య అభినందించారు.

'పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి'

నల్లగొండ టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద 11వ తేదీన నిర్వహించే తెలంగాణ పెన్షనర్ల మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టాప్రా జిల్లా గౌరవాధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, ఎండీ. అబ్దుల్ ఖాదర్, వనం వాణిశ్రీ, వాడపల్లి రమేష్, డివిజన్ కార్యదర్శి గుండాల బిక్షమయ్య పాల్గొన్నారు.

పోచంపల్లి చేనేత వస్త్రాలకు విశ్వఖ్యాతి

● హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



మాట్లాడుతున్న హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



మగ్గం పరిశీలిస్తున్న బండారు దత్తాత్రేయ

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పోచంపల్లి చేనేత ఇక్కత్ చీరలకు దేశ, విదేశాల్లో మంచి ప్రాముఖ్యత ఉందని, విశ్వఖ్యాతి పొందాయని హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా యాదాద్రిభువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో గురువారం జరిగిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. స్థానిక కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దత్తాత్రేయ మాట్లాడుతూ గ్రామీణ కుటీర పరిశ్రమను గుర్తించి జాతీయ దినోత్సవం ఏర్పాటు చేసిన ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలిపారు. సంప్రదాయ చేనేత కళను ఆదరించాలని, చేనేత చీర భారతీయ మహిళలకు ప్రతీక అని అన్నారు. చేనేత వస్త్రాలు ధరించి చేనేతను ఆదరిద్దామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది, అధికారులు, అన్ని వర్గాల ప్రజలు చేనేత వస్త్రాలు ధరించాల్సిందిగా కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతకు మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. తక్కువ వడ్డీతో చేనేత కార్మికులకు రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. చేనేత కార్మికులకు ఆరోగ్య బీమా, పిల్లలకు ఉన్నత విద్యకు సహకారం అందేలా స్కీమ్‌లు అమలు చేయాలన్నారు. భూదాన్‌పోచంపల్లిలో సీడీపీ సెంటర్‌ను ఏర్పాటు చేసేలా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడుతానన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీకి భారత రత్న అవార్డు ఇచ్చే విధంగా భారత ప్రభుత్వాన్ని కోరుతానన్నారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వంతో మాట్లాడి సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. అనంతరం పట్టణంలోని చేనేత కార్మికుల గృహాలు సందర్శించి మగ్గాలపై చేనేత వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ కర్నాటి ధనుంజయ, మాజీ సర్పంచ్ నోముల గణేష్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్నం శివకుమార్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములుశ్రేష్ఠి, చేనేత నాయకులు భారత లవకుమార్, కర్నాటి బాలరాజు, అంకం పాండు, భారత వాసుదేవ్, మెరుగు శశికళ, రాపోలు శ్రీనివాస్, గంజి బాలరాజు, అంకం మురళి, బోగ నర్సింహ, ఇంజమూరి యాదగిరి పాల్గొన్నారు.

అవార్డులు ప్రదానం

సంస్థాన్‌నారాయణపురం, భూదాన్‌పోచంపల్లి, చండూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన చేనేత జాతీయ గజం నర్మద, గూడ పవన్ అవార్డులు అందుకున్నారు. న్యూఢిల్లీలోని భారత్ భవన్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో వారికి కేంద్ర జౌళి శాఖమంత్రి గిరిరాజ్ సింగ్ అవార్డులు ప్రదానం చేశారు. అవార్డుతో పాటు ప్రశంసాపత్రం నగదు బహుమతి అందజేశారు.

● హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో చేనేత కళాకారులు సామల భాస్కర్, కొలను శంకర్, మంగళపల్లి శ్రీహరి, అవ్వారు రవీంద్రకు చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అవార్డులు ప్రదానం చేశారు.



ఢిల్లీలో కేంద్రమంత్రి గిరి రాజ్‌సింగ్ నుంచి చేనేత జాతీయ అవార్డు అందుకుంటున్న చేనేత కళాకారులు గూడ పవన్, గజం నర్మద, హైదరాబాద్‌లో మంత్రి నాగేశ్వర్‌రావు నుంచి అవార్డు అందుకుంటున్న మంగళపల్లి శ్రీహరి, సామల భాస్కర్, అవ్వారు రవీంద్ర

న్యాక్ ఏ గ్రేడ్ లక్ష్య సాధనగా ప్రణాళికలు

● ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్



మాట్లాడుతున్న ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మూడో విడత న్యాక్ గ్రేడింగ్ లో ఏ ర్యాంక్ సాధించే దిశగా ప్రణాళికలు ఉండాలని ఎంజీయూ ఉపకులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అధ్యాపకులకు సూచించారు. యూనివర్సిటీ చాంబర్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ న్యాక్‌కు అందించే సెల్ఫ్‌స్టడీ రిపోర్ట్‌లోని అంశాలపై అధ్యాపకులు క్షుణ్ణంగా అవగాహన పెంచుకోవాలన్నారు. తద్వారా తమ విభాగాల ప్రత్యేకతల అనుసారం ముందుకు సాగాలన్నారు. ప్రతి విభాగం విధిగా వర్క్‌షాపులు, సెమినార్ల నిర్వహణతో పాటు పరిశోధనల వైపు విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు. అధ్యాపకులు సైతం పరిశోధనల్లో నిమగ్నం అవ్వాలన్నారు. పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థులు తమ పరిశోధన కాలంలో కనీసం రెండు పరిశోధన పత్రాలను సమర్పించాలని, ఆ దిశగా అధ్యాపకులు ప్రోత్సహించాలని సూచించారు. గతంలో రూపొందించిన కోర్సు ఉద్దేశాలు ప్రోగ్రాం ఉద్దేశాల దృక్కోణంలో పరీక్షల ప్రశ్నాపత్రాలను రూపొందించడం ద్వారా మూల్యంకనంలో ప్రతిబింబుస్తుందన్నారు.

సాగర్ నీటి మట్టం 588.50 అడుగులు



నిండు కుండలా ఉన్న నాగార్జునసాగర్ ప్రాజెక్టు, 588.50 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం స్కేలు

నాగార్జునసాగర్/కేతేపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువనుంచి వరద రాక నిలకడగా కొనసాగుతోంది. వారం రోజులుగా నిలకడగా 50 వేల క్యూసెక్కుల వరద రాక కొనసాగుతోంది. ఎగువ నుంచి వరద రాక (లక్ష క్యూసెక్కులు దాటితే) పెరిగితే మరో రెండు రోజుల్లో సాగర్ ఒకటి, రెండు క్రస్ట్ గేట్లు ఎత్తే అవకాశం ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) గురువారం సాయంత్రానికి 588.50 అడుగులుగా (307.5790 టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి కుడి కాలువ ద్వారా 5,088 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8,541 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,420 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 44,149 క్యూసెక్కుల నీరు విడుదల అవుతుండగా ఎగువ నుంచి 65,930 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీ రెండు గేట్ల నుంచి నీటి విడుదల

ఎగువనుంచి వరద పెరగటంతో నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని మూసీ జలాశయం రెండు గేట్ల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 2,558.31క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నీటిమట్టం 643.50అడుగులు(4.07టీఎంసీలు)గా నమోదైంది. ప్రాజెక్టు 3, 8నెంబరు క్రస్టుగేట్లను అడుగు మేర ఎత్తి 450క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 551.65 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఎగువ నుంచి 2558.31క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా ప్రాజెక్టు నీటిమట్టం 643.50అడుగులు(4.07టీఎంసీలు)గా ఉంది.

సెల్‌ఫోన్, లగేజీ టెండర్‌కు రూ.2.22కోట్ల వేలం

● టెండరు దక్కించుకున్న యాదగిరిగుట్ట వాసి ● గతంలో ఇదే టెండరుకు రూ. 1.50కోట్లు

యాదగిరిగుట్ట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి వచ్చే భక్తుల సెల్‌ఫోన్, లగేజీ కౌంటర్ నిర్వహణ టెండర్‌ను రూ.2.22కోట్లకు ఫ్రై ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ సంస్థ దక్కించుకుంది. గురువారం అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి పర్యవేక్షణలో ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సెల్‌ఫోన్లు, లగేజీ టెండరుకు యాదగిరిగుట్టకు చెందిన ఫ్రై ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ సంస్థ నిర్వాహకుడు ప్రవీణ్ రూ. 2,22,22,222తో సీల్ టెండర్ వేసి దక్కించుకున్నాడు. గతంలో ఇదే టెండర్‌ను బీబీనగర్‌కు చెందిన పంజాల సదానంద్‌గౌడ్ రూ.1.50కోట్లకు దక్కించుకోగా, 18శాతం జీఎస్టీ కలిపి రూ. 1.80కోట్లు చెల్లించారు. తాజాగా దక్కిన రూ.2.22కోట్ల టెండరుకు అదనంగా 18శాతం జీఎస్టీతో కలిపి రూ.2.62 కోట్లు చెల్లించాల్సి ఉంది. దేవస్థానం గత నెల 21న లీజెస్ విభాగానికి చెందిన టెండర్లు ఆహ్వానించగా, 16 ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఒక టెండరు వేశారు. వేలంలో రూ.2.04 కోట్లు పలకగా, రూ.2.22 కోట్లకు దాఖలుచేసిన ఫ్రై ఇన్‌ఫ్రా టెక్నాలజీస్ సంస్థ టెండర్ దక్కించుకుంది. పాత టెండరు రెండు నెలల (ఆగస్టు, సెప్టెంబరు) గడువు ఉండగా, అక్టోబరు నెల నుంచి ఈ టెండరు ప్రక్రియ అమల్లోకి రానుంది.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు



నిత్యకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు పాంచరాత్రగమ శాస్త్ర రీతిలో అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రధానాలయ నైరుతి దిశలో అష్టభుజి ప్రాకార మండ పంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం చేపట్టారు. ఉత్సవమూర్తులను కల్యాణ మండపంలో అధిష్టింపజేసి, విశ్వక్సేనుడి తొలిపూజలతో కల్యాణతంతు కొన సాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ఆశీర్వచనం అందజేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమం పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలో స్వామిఅమ్మవారలను సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చకులు నిజాభిషేకం, నిత్యార్చనలు చేపట్టారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో జరిగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వ రస్వామికి నిత్య పూజలు, యాగశాలలో నిత్య రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ. 14,24,320 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.

ఎన్ఆర్ఐ దాతృత్వం.. రూ.3లక్షల సాయం



బాధిత కుటుంబానికి బాండ్ అందజేస్తున్న ఎన్ఆర్ఐ రమేష్ తల్లి లింగమ్మ

మర్రిగూడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన యాచారం వెంకటేష్ కొంతకాలం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండలకేంద్రానికి చెందిన ప్రవాస భారతీయుడు(ఎన్ఆర్ఐ) యాచారం రమేష్ బాధిత కుటుంబానికి రూ.3లక్షలు బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్‌ను రమేష్ తల్లి లింగమ్మ ద్వారా వెంకటేష్ భార్యకు గురువారం అందజేశారు. యాచారం రమేష్ వృత్తి రీత్యా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ అమెరికాలో స్థిరపడ్డాడు. అమెరికాలో స్థిరపడినప్పటికీ ఉన్న ఊరిని మరవలేదు. నిరుపేద కుటుంబాలను ఆదుకొని సేవా దృక్పథంతో తన వంతుగా తోచినంత ఏదో ఒకరకంగా ఆర్థికంగా సహాయం చేయాలని సంకల్పించారు. మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన యాచారం వెంకటేష్ రోడ్డు ప్రమాదం మృతిచెందాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో వారి కుటుంబ పోషణ, ఆర్థిక పరిస్థితి భారంగా మారింది. ఈ విషయాన్ని ఇరుగుపొరుగు వారితో వెంకటేష్ ఇంటి పరిస్థితి తెలుసుకున్నారు. రూ.3లక్షలను చిన్నారుల పేర్ల మీద బ్యాంకులో డిపాజిట్ చేసి రమేష్ తల్లి యాచారం లింగమ్మ ద్వారా మృతుడి భార్య సైదమ్మకు బాండ్‌ను అందజేశారు. ఎన్ఆర్ఐ యాచారం రమేష్‌ను గ్రామస్థులు అభినందించారు.

సాగు చట్టాలపై అవగాహన ఉండాలి

● రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్

నిడమనూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సాగు చట్టాలపై రైతులు అవగాహన కలిగి ఉండి పంటలు సేద్యం చేయాలని రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు భూమి సునీల్ అన్నారు. సాగు న్యాయ యాత్రలో భాగంగా లీఫ్స్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రంలోని రైతువేదికలో 'రైతుకు చట్టాలను చుట్టం చేయడమే లక్ష్యం' అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో 60శాతానికి పైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారమన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలు అమలు చేస్తున్నాయని గుర్తు చేశారు. సాగు రంగంలో చట్టాల పాత్ర పెరుగుతూ వస్తున్నందున రైతులు చట్టాలను వినియోగించుకొని సేద్యం చేసినప్పుడే న్యాయం జరుగుతుందన్నారు. స్వాధీనంలో భూమి, చేతిలో పట్టాదారు పాస్‌పుస్తకం, భూభారతిలో పేరు ఉంటేనే భూమికి భద్రత ఉంటుందన్నారు. నాణ్యమైన విత్తనం రైతుల హక్కు అని, నాణ్యత లేని విత్తనాలతో నష్టం జరిగితే రైతులు పరిహారం పొందవచ్చునన్నారు. రైతులకు సాగునీటిని అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. రైతులకు బ్యాంకులు ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పంట రుణాలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. రుణం పొందిన రైతులు పంట నష్టం జరిగితే పంటల బీమా కాపాడుతుందన్నారు. రైతులు పండించిన ఉత్పత్తులు అమ్ముకునేందుకు సరైన మార్కెట్ సౌకర్యం కల్పించాలన్నారు. అనంతరం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. సమావేశంలో భూదాన్ బోర్డు మాజీ చైర్మన్ గున్న రాజేందర్‌రెడ్డి, ఓఎస్డీ హరివెంకటప్రసాద్, హాలియా ఏడీఏ సరిత, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, ఏవో మునికృష్ణయ్య, మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, ఏఈవోలు దండెం విజయచంద్ర, మహేష్, క్రాంతి, అనిల్, లీఫ్స్ ప్రతినిధులు అభిలాష్, జీవన్, మల్లేష్, ప్రవీణ్, సందీప్, రైతులు శివ మారయ్య, నర్సింగు విజయ్, పోలే రవి, మోసాల శ్రీను, పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి భూభారతి

మిర్యాలగూడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారం కోసం ప్రవేశపెట్టిన భూభారతి చట్టం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ధరణి కమిటీ సభ్యుడు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు ఎం. సునీల్ అన్నారు. గురువారం స్థానిక రైతు వేదికలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సాగురంగంలో చట్టాల పాత్ర పెరుగుతుందని, చట్టాలను వినియోగించుకుంటే ఏరువాక సాఫీగా సాగుతుందన్నారు. అనంతరం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌లు లీఫ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు.



నిడమనూరులో మాట్లాడుతున్న రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు సునీల్

కోదాడ రూరల్: సాగురంగంలో చట్టాల పాత్ర పెరుగుతోందని రాష్ట్ర రైతు సంక్షేమ కమీషన్ సభ్యులు భూమి సునీల్ అన్నారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని అల్వాలపురం రైతు వేదికలో గురువారం సాగు న్యాయయాత్ర సమావేశం నిర్వహించారు. దేశంలో అధిక శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడుతున్నట్లు తెలిపారు. రైతులు చట్టాలను వినియోగించగలిగితే ఏరువాక సాఫీగా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి గ్రామాల్లో సాగు న్యాయయాత్ర చేపట్టినట్లు తెలిపారు. రైతులకు అవగాహన కల్పించేందుకు సమావేశాల రూపంలో అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వాజిద్, ఏవో రజిని, వంగవీటి రామారావు, ఎర్రవరం ప్యాక్స్ చైర్మన్ నల్లజర్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యాంత్రీకరణ పరికరాల కోసం దరఖాస్తుల స్వీకరణ

మర్రిగూడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో సహస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ ఎస్టీ, మహిళ రైతులకు 50శాతం సబ్సిడీతో, ఇతర రైతులకు 40శాతం సబ్సిడీతో ఇస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఆసక్తిగల రైతులు మండలంలోని ఏఈవో క్లస్టర్ పరిధిలో రైతు వేదిక కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

చిట్యాలరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): బీజేపీ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని వెలిమినేడులో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ఉయ్యాల లింగస్వామి, అంశల అనిల్‌కుమార్, రాఘవరెడ్డి, వినోద్, వెంకట్‌రెడ్డి, శ్రీకాంత్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

సమాచారం

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

శాలిగౌరారం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవలని తక్కళ్లపహాడ్ మాజీ సర్పంచ్ తిరుపారి మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు కట్టంగూరి సురేందర్ రెడ్డి కోరారు. మండలంలోని తక్కళ్లపహాడ్ గ్రామంలో హిమాలయ ఆస్పత్రి, నవ్య చారిటుబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ వ్యాధులకు సంబంధించిన డాక్టర్లు పరీక్షలు చేసి ఉచితగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు పులిగిల్ల అభిరామ్, నరేందర్, వీపూరి పరాంకుశం తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా విట్టల్‌రెడ్డి

మర్రిగూడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మర్రిగూడ గ్రామ భక్తాంజనేయస్వామి దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా గుమ్మకొండ విట్టల్‌రెడ్డి ఎన్నికయ్యారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా గుమ్మకొండ విట్టల్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా పందుల రాములుగౌడ్, జనరల్ సెక్రటరీగా చెరుకు శ్రీరాములు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కమిటీ ఎన్నిక పురోహితులు లోక వెంకటశర్మ, పొనుగోటి విజయరామరావు, పాల్వాయి అనిల్‌రెడ్డిల సమక్షంలో నిర్వహించారు.

ఒక్క బోరే దిక్కు





- వట్టిపోయిన బోర్లు
- అవురవాణిలో నీటి కొరత
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

మండలంలోని అవురవాణి గ్రామంలో నీటి కొరతతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామంలో గతంలో ఆరు బోర్లతో నీటిన సరఫరా చేసేవారు. కాలక్రమంలో వీటిలో 3 బోర్లు పూర్తిగా ఎండిపోయాయి. మిగతా మూడింటిలో ఓ బోరు నీరు నర్సరీ నిర్వహణకే సరిపోతుంది. మరో (అద్దె) బోరును బిల్లు ఇవ్వడం లేదని యజమాని ఆపేశాడు. మిగిలింది ఇక ఒకటే బోరు. దీంతో ఒక్క బోరుతో ఊరంతా నీరు సరిపోక గ్రామస్థులు కొన్ని రోజులుగా 'కన్నీటి' అవస్థలు పడుతున్నారు. ఏదైనా పర్వదినమో, ఎవరి ఇంట్లోనైనా శుభ, అశుభ కార్యాలు జరిగాయంటే ఇక నీటి ఇబ్బందులను ఎదుర్కోవాల్సిందే.

- (ఆంధ్రజ్యోతి,నార్కట్‌పల్లి)

అవురవాణి గ్రామస్థుల నీటి అవసరాలు తీర్చేందుకు గ్రామ పంచాయతీకి చెందిన బోర్లలో సగం పైగా ఎండిపోయాయి. కొత్తగా బోరు వేసినా నీరు పడే పరిస్థితులు మృగ్యమవడంతో వేయలేదు. దీంతో ప్రతీ వేసవికాలంలో అద్దె బోరును వినియోగించుకుని ఎలాగోలా గట్టెక్కుతున్నారు. ఈ పర్యాయం అద్దె బోరు యజమానులు తమకు ఐదు నెలలుగా బోరు వాడకం బిల్లులు ఇవ్వకపోవడంతో నీటిని ఆపేశాడు. దీంతో గ్రామ పంచాయతీకి ఉన్న ఒక్క బోరుతో నీరు సరిపడక కొంతమంది డబ్బులు వెచ్చించుకుని ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి వాడుకుంటున్నారు. మిషన్ భగీరథ నీరు కూడా సరిపోను రావడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు.

నీటి ఎద్దడిని తీర్చాలి



కొన్ని రోజులుగా నీటి ఎద్దడి తీవ్రతను భరించలేక పోతున్నాం. గ్రామ పంచాయతీ బోర్లు ఎండిపోవడంతో సరిపడా నీరు అందడం లేదు. దీంతో నీటి అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. ఇంట్లో ఏదైనా కార్యక్రమం జరిగితే నీటి సమస్య గురించి ఆలోచించాల్సి వస్తుంది. అధికారులు వెంటనే స్పందించి అవురవాణిలో నీటి సమస్యను పరిష్కరించాలి.

- మాదగోని సునీత, మాజీ వార్డు సభ్యురాలు

బకాయి బిల్లు ఇప్పిస్తా

ఒకే ఒక్క బోరుతో గ్రామంలో కొంత నీటి ఎద్ద డి ఉన్న మాట వాస్తవమే. మొన్నటి వరకు గ్రామపంచాయతీకి చెందిన బోర్లకు తోడు మరో అద్దెబోరుతో కలిపి ఊరికి సరిపోనూ నీరందేది. ఐదు నెలలుగా అద్దెబోరు బిల్లు ఇవ్వలేక పోయాం. దీంతో యజమాని బోరు నీటిని ఆపేశాడు. రెండు రోజుల్లో అద్దెబోరు బిల్లు చెల్లించేలా ప్రయత్నం చేస్తున్నా. అదే సమయంలో నీటి ఎద్దడి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- ఆర్.రేణుక, పంచాయతీ కార్యదర్శి

కాల్వకు నీరందిస్తే పెరగనున్న భూగర్భజలాలు

అవురవాణి గ్రామస్థుల మంచినీటి తిప్పలు తీరాలంటే గ్రామానికి సాగునీటి తరలిస్తున్నారు. రైతుల సాయంతో తవ్విన కాల్వకు బీ.వెల్లెంల రిజర్వాయర్ ఎడమకాల్వ ద్వారా నీటిని వదలాలి. దీంతో చెరువులోకి నీరు చేరితే ఇటు రైతులకు సాగునీటితో గ్రామ పంచాయతీ బోర్లు కూడా రీచార్జ్ అయి గ్రామస్థుల అవసరాలకు సరిపడా మంచి నీటిని సరఫరా చేయగలిగే అవకాశం ఉంటుంది.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : గుత్తా

నల్లగొండటౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం నిరుపేదలకువరం లాంటిందని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం 47 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. వివిధ అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి సీఎంఆర్ఎఫ్‌తో ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే లక్షలాది మంది నిరుపేదలకు సహాయం అందించినట్లు ఆయన వెల్లడించారు. ఈ పథకాన్ని నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏపీలింగోటం జడ్పీహెచ్ఎస్‌లో వనమహోత్సవం

నార్కట్‌పల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపీలింగోటం జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం వన మహోత్సవాన్ని నిర్వహించారు. అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వనమహోత్సవంలో భాగంగా పాఠశాల ఆవరణలో వివిధ రకాలైన మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కాశయ్య, నార్కట్‌పల్లి, కట్టంగూరు బీట్ ఆఫీసర్లు భవాని, శిరీష, ఉపాధ్యాయులు హెప్సిబా, ఆదిమల్ల మణిరాజు, సత్యనారాయణ, పద్మావతి, ఆరిఫ్, హేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యూబా ప్రజలకు అండగా ఉండాలి



విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండరూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అమెరికా నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు అండగా ఉండాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి సలీం, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పిలుపునిచ్చారు. సీఐటీ యూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు క్యూబా సంఘీభావనిధి కోసం నల్లగొండ పట్టణంలో గురువారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ కార్మికుడు, ప్రజలు కష్టాల్లో ఉన్నా వారికి సీఐటీయూ మద్దతిస్తుందని అన్నారు. ప్రతీ కార్మికుడు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతు క్యూబాకు అండగా నిలవాలని అన్నారు. సీఐటీయూ పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు సలివేజు సైదాచారి, నల్లగొండ పట్టణ ఎగుమతి దిగుమతి హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు అవిరేషు మారయ్య, కార్యదర్శి బొమ్మకంటి లక్ష్మీపతి తదిదరులు పాల్గొన్నారు.

కార్మికుల అక్రమ అరెస్టులు సరికాదు : సీఐటీయూ



దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో పాల్గొన్న తుమ్మల వీరారెడ్డి

నల్లగొండ రూరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు సామరస్యంగా పోరాటాలు చేస్తున్నా అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం స్థానిక సుభాష్ విగ్రహం వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తూ, కార్మికులను ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టులు చేస్తున్నారని విమర్శించారు. కార్మికులు నెలల కొద్ది వేతనాలు రాక, కుటుంబాలు నడపలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అదే మీకు ఒక నెల జీతం ఇవ్వకుంటే పని చేస్తారా, జీతం ఇవ్వమని అడిగితే అక్రమంగా అరెస్టులు, నిర్బంధిస్తారా అని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించని యెడల సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పోలే సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి అల్లి అనురాధ, నాయకులు అండాలు, మహేశ్వరి, వెంకటమ్మ పాల్గొన్నారు.

మర్రిగూడ: మధ్యాహ్న భోజన వంట కార్మికులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న వారిని పోలీసులు అరెస్టు చేయడం బాధాకరమన్నారు. కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండుగలు



శాలిగౌరారంలో బోనాల ప్రదర్శన

కేతేపల్లి, నార్కట్‌పల్లి, శాలిగౌరారం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో గురువారం భక్తి శ్రద్ధలతో బోనాల పండుగలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పసుపు, కుంకుమ వేప ఆకులతో బోనం కుండను అలంకరించి సంప్రదాయ డప్పు నృత్యాలతో వెళ్లిన మహిళలు ముత్యాలమ్మకు నైవేద్యం సమర్పించారు. బోనాల్లో వండిన నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి చీర, సారెలతోపాటు కోళ్లు, జీవాలను బలి ఇచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. రైతులు తమ ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లను అమ్మవారి గుడి చుట్టూ తిప్పి ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నారు. ఆలయాల వద్ద ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

● కేతేపల్లి మండలంలోని గుడివాడ, ఇప్పలగూడెం గ్రామాల్లో ముత్యాలమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో జరిగిన వేడుకల్లో మార్కెట్ డైరెక్టర్ ఎస్‌కె.లతీఫ్, మాజీ సర్పంచులు కట్టా శ్రవణ్‌కుమార్, వివిధ పార్టీలకు చెందిన నాయకులు జగన్నాథం, పురుషోత్తం, గోపి, లింగయ్య పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లిలో గ్రామదేవత ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రాధారపు బిక్షపతి, గౌరవ సలహాదారుడు యాద వెంకన్న, సభ్యులు ఇడుకుళ్ల బిక్షమయ్య, రాములు, ప్రజ్ఞాపురం రాములు, గిరిప్రసాద్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మ బోనాలతో మహిళలు

● శాలిగౌరారం మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శ్రావణ మాస బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందంగా అలంకరించిన బోనాలలో అమ్మవారికి నైవేద్యంతో ప్రదర్శనగా వెళ్లి గ్రామశివారులో ఉన్న ముత్యాలమ్మ దేవతకు సమర్పించారు.

దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు

చిట్యాలరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో దివ్యాంగులకు పింఛన్‌ను రూ. 6వేలకు పెంచి ఇస్తామని చేసిన హామీని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మేడి శంకర్, జిల్లా ప్రధానకార్యదర్శి ఎరసాని గోపాల్, వీహెచ్‌పీ జిల్లా కోశాధికారి తుమ్మల లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షుడు మేడి కృష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని ఏపూర్, పిట్టంపల్లిలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల చేయూత పింఛనుదారుల సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ఆసరా, దివ్యాంగుల పింఛన్లను పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిట్యాల పట్టణంలోని బీఎన్ రెడ్డి గార్డెన్స్‌లో 11వ తేదీన దివ్యాంగుల చేయూత పింఛన్‌దారుల సన్నాహక సమావేశానికి దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి కావలి కృష్ణ, ఎరసాని లింగస్వామి, మంకాల శ్రీను, దివ్యాంగులు, ఆసరా పింఛన్‌దారులు పాల్గొన్నారు.

● మర్రిగూడ: మర్రిగూడ, సరంపేట, తిరుగండ్లపల్లి గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో దివ్యాంగుల చేయూత పింఛనుదారుల సంఘం మండల అధ్యక్షుడు మేతరి రాములు మాట్లాడారు. ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో దివ్యాంగుల పెన్షన్ చేయూతదారుల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తిరుమలేష్, రాజు, దివ్యాంగులు శ్రీను, దశరథ, ఆంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్, ఎక్స్‌కవేటర్ పట్టివేత : కేసు నమోదు

కనగల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తవ్వుతున్న, తరలిస్తున్న వాహనాలను గురువారం పట్టుకున్నట్లు ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎస్‌లింగోటం గ్రామ వాగులో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బోయినపల్లి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మరో ట్రాక్టర్‌ను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. సదరు డ్రైవర్లపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. అనంతరం ఆయన ఎస్ఐ రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి ఉన్న ప్రదేశంలోనే ఇసుక తవ్వకాలు చేయాలని సూచించారు.

నేడు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

నల్లగొండకల్చరల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని షేర్‌బంగ్లాలో గల సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నారు. అర్చకులు కారంపూడి మోహనాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకం, కుంకుమార్చనలు, ఒడి బియ్యం, ఉద్యాపనలు వంటి పూజలు నిర్వహించనున్నారు. తులసీనగర్‌లోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఉదయం 10.30 గంటలకు సామూహిక వ్రతాలు నిర్వహించనున్నారు. సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రం కావటంతో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు, అక్షర కంకణధారణ, సరస్వతి సూక్త హోమం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. వరలక్ష్మి వ్రతాలు, అక్షరాభ్యాస కార్యక్రమాల్లో పాల్గొనే భక్తులు ముందుగానే తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆ ఆలయ మేనేజర్ తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలి

కనగల్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా 11వ తేదీన నిర్వహించే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ రామకృష్ణ అన్నారు. కనగల్ పీహెచ్‌సీలో గురువారం ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు, వైద్యసిబ్బందికి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. 1 నుంచి 2 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు సగం ఆల్బెండజోల్ మాత్రను చూర్ణం చేసి ఇవ్వాలని సూచించారు. 2 నుంచి 19 ఏళ్ల వయస్సు గల వారికి పూర్తి మాత్రను మింగించాలని అన్నారు. నులి పురుగుల రహిత ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు శాబుద్దీన్, శశిదేవి, వెంకటేశం, పద్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ఇక చౌక

(5వపేజీ తరువాయి)

అనుసంధానంగా వేబ్రిడ్జితోపాటు ఆన్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో సాండ్ బజార్ సైట్ ద్వారా ఇసుకను బుక్ చేసుకునే వీలు కల్పించారు.

సిమెంట్‌ను కూడా తక్కువ ధరకే...

ఇళ్ల నిర్మాణంలో ఇసుక తరువాత ఎక్కువగా వినియోగించే సిమెంట్‌ను సైతం తక్కువ ధరకే అందించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ చొరవచూపి మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని అదానీ, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీల ప్రతినిధులతో మూడురోజుల క్రితం సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రొడక్ట్ కాస్ట్, ట్రాన్స్‌పోర్ట్ చార్జీల మేరకే సిమెంట్ సరఫరా చేయాలని రిక్విజేషన్ లెటర్స్ ఇచ్చారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం 5000 ఇందిరమ్మ ఇళ్లకు సిమెంట్‌ను సైతం పేదలకు అనుకూల ధరలో లభ్యమయ్యేలా విధంగా చూడాలని ప్రతిపాదించారు.

ప్రస్తుతం సిమెంట్ బస్తా ధర రూ.350కి విక్రయిస్తుండగా ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం ఉత్పత్తి ధర, రవాణా చార్జీలతో కలిపి ఇందిరమ్మ లబ్ధిదారులకు రూ.300 లోపు ధరకు సరఫరా చేయాలని కోరినట్లు తెలిసింది. ఒక్కో ఇంటికి 225 బస్తాల సిమెంట్ అవసరమని ఇంజనీర్లు అంచనా వేశారు. దీంతో పట్టణంలోని 5,000 ఇళ్లకు సరిపడా సిమెంట్ బస్తాలను సరఫరా చేసేలా యాజమాన్యలతో మాట్లాడి సాధ్యమైనంత తొందరగా సానుకూల నిర్ణయం తీసుకునేలా చూడాలని సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులను కోరినట్లు సమాచారం. సిమెంటు బస్తాలను అన్ని మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచి ఏఈఒల ద్వారా లబ్ధిదారులకు అవసరమైన మేరకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చర్యలు

డాక్టర్ శాలిని, వైద్యాధికారి, మర్రిగూడ



సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వాటిని నివారించేందుకు ముందస్తుగా వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అవగాహన కల్పిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ శాలిని అన్నారు.

(మర్రిగూడ, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డాక్టర్: వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులు సోకకుండా వైద్యులు ఇంటింటికి తిరుగుతూ వ్యాధుల నివారణ కోసం చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని సబ్ సెంటర్లు ఉన్నాయి? ఎంత మంది డాక్టర్లు ఉన్నారు?

డాక్టర్: మండలంలో ఏడు సబ్ సెంటర్లు ఉన్నాయి. ఏడుగురు వైద్యులు ఉన్నారు. వారి ద్వారా వైద్యసేవలు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మందుల కొరత ఏమైనా ఉందా?

డాక్టర్: సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున ముందస్తుగా మందులను అందుబాటులో ఉంచుకున్నాం. ఎలాంటి కొరత లేదు.

స్వాతంత్రోద్యమంలో పద్మశాలీలది కీలకపాత్ర

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి



చేనేత కార్మికులను సన్మానించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

రామగిరి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య ఉద్యమంలో పద్మశాలీలది కీలకపాత్ర పోషించారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలోని ర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గాంధీజీ సైతం రాట్నంపై నూలు వడికేందుకు అత్యంత ప్రాధాన్యమిచ్చారని అన్నారు. చేనేతరంగానికి ప్రత్యేకంగా ఒకరోజు ఉండాలన్న ఉద్దేశంతో ప్రధాని నరేంద్రమోదీ జాతీ య చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిరియాల వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, కోమటి వీరేశం, పోతేపాక లింగస్వామి, పిట్టల శ్రీనివాస్, తిరందాస్ కనకయ్య, రాపోలు విద్యాసాగర్, కటకం శ్రీధర్, రాపోలు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

● మర్రిగూడ, నార్కట్‌పల్లి: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పలు మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో చేనేత సహకార కార్మికుల సంఘం నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం చేనేత కార్మికులకు షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం త్రిఫ్ట్ ఫండ్, చేనేత భరోసా, చేనేత బీమా, పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నా వాటిల్లో తిరకాసు పెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల చేనేత కార్మికులు సంక్షేమ పథకాలు పొందలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మగ్గాలు నడవక చేనేత కార్మికుల పరిస్థితులు, జీవితాలు అగమ్యగోచరంగా మారాయని అన్నారు. చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు.

● మర్రిగూడ మండల కేంద్రంలో రాజ్‌పేట్ తండా చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత సహకార కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు సంగేపు వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికులను ఆదుకోవాలని కోరారు కార్యక్రమంలో చెరుపల్లి ముత్యాలు, సంగేపు రవి, చేరుపల్లి ఈశ్వర్, రాధాకృష్ణ, చేరుపల్లి శివశంకర్, ప్రేమలత, అమృత, సంతోష, వనజ, కళావతి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలకేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు గంజి రమేష్ పాల్గొని మాట్లాడారు. ఆకలి చావులకు దగ్గరవుతున్న చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. చేనేత కళాకారులు సుంకి శ్రీను, పిల్లలమర్రి శ్రీహరిలను సన్మానించారు. మండలంలోని అమ్మనబోలులో పద్మశాలీలు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పద్మశాలీ యువజన సంఘం మండల అధ్యక్షుడు చెరుపల్లి రఘుపతి, నాయకులు గర్దాసు వెంకన్న, నామని ప్రభాకర్, పెండెం వెంకటేశం, కొలను శ్రీనివాస్, రమేష్, శ్రీను, వేణు, దశరథ, నాగరాజు, శ్రీను, చేనేత ఐక్యవేదిక జిల్లా వర్కింగ్ అధ్యక్షుడు పోచం వెంకటేశ్వర్లు, బద్దం వరలక్ష్మీరాంరెడ్డి, కొంపెల్లి సైదులు, రాపోలు వెంకటేశం, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

కురిసింది వాన

నల్లగొండ పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ



నల్లగొండ పట్టణంలో కురుస్తున్న వర్షం




వర్షంలోనూ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



జలమయమైన పానగల్ బైపాస్

ఆంధ్రజ్యోతి
***
గరిష్ఠం 32.0
కనిష్ఠం 22.4

ANDHRAJYOTHY

నల్లగొండ
5
శుక్రవారం 8 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	588.50 (307.5790)	65,930	44,149
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.50 (4.07)	2,558.31	1,062.79
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.8982 (42.5720)	27,571	17,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.125 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.220

'ఫిలిప్పీన్స్'కి ఎగుమతుల్లో...

ఛాన్స్ దక్కేనా?



- గత ఏడాది జిల్లా నుంచి నామమాత్రంగానే
- టెండర్ ధాన్యానికి ఎగుమతులకు లింక్‌తో దూరమైన అవకాశం
- ఈసారి అవకాశం ఇవ్వాలంటున్న మిల్లర్లు

నల్లగొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విదేశాలకు బియ్యం ఎగుమతుల్లో నల్లగొండ జిల్లాకు తగిన స్థానం దక్కడం లేదు. రైస్‌బౌల్ ఆఫ్ ఆసియాగా పేరుగాంచినా, రాష్ట్రంలోనే అత్యధిక వరి దిగుబడి, అత్యధిక రైస్‌మిల్లులు ఉన్నా ఎగుమతులకు వచ్చేసారికి అస్థాయి ప్రాధాన్యం కరువవుతోంది. గత ఏడాది ఫిలిప్పీన్స్‌కు రాష్ట్రం నుంచి 2.5లక్షల మెట్రిక్‌టన్నుల బియ్యం ఎగుమతికి ఒప్పందం కుదిరింది. అందులో భాగంగా ఇప్పటివరకు ఎగుమతి చేసిన 50వేల మెట్రిక్‌టన్నుల్లో నల్లగొండ జిల్లా నుంచి కేవలం 500మెట్రిక్‌టన్నులకే అవకాశం దక్కింది. తెలంగాణ సోనా రకం బియ్యం రవాణా చేస్తుండడం, టెండర్ వేసి విక్రయించిన బియ్యం నుంచే ఎగుమతులు చేయాలనే నిబంధన విధించడంతో జిల్లాకు ఎగుమతుల అవకాశం దక్కలేదని తెలుస్తోంది. తాజాగా ఈ ఏడాది సైతం ఫిలిప్పీన్స్‌కు మరో 2లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఎగుమతికి అవకాశం వచ్చిన నేపథ్యంలో ఈసారైనా జిల్లాకు ప్రాధాన్యం ఇవ్వాలని మిల్లర్లు కోరుతున్నారు.

టెండర్ బియ్యం లింక్‌తో దక్కని ఛాన్స్

గత ఏడాది ఫిలిప్పీన్స్ దేశానికి ఎగుమతి నిమిత్తం రాష్ట్ర పౌరసరఫరాలశాఖ పలు రకాల బియ్యాన్ని పరిశీలించింది. సాంబమసూరి, తెలంగాణ సోనా, జైశ్రీరామ్, తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్), గంగాకావేరీ, పూజగోల్డ్ రకాలను, దొడ్డుబియ్యానికి సంబంధించి 1010 రకాలను పరిశీలించారు. ఫిలిప్పీన్స్ ప్రతినిధులు ఎంపికచేసిన వాటిలో తెలంగాణసోనా,ఎంటీయూ 1010 రకాల నుంచి బియ్యం ఎగుమతి చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఎగుమతి చేసిన బియ్యానికి టెండర్ వేసింది.దానికి సంబంధించిన ధాన్యం నుంచే బియ్యం ఇవ్వాలని నిర్ణయించడంతో జిల్లాకు ప్రాధాన్యం లేకుండా పోయింది. జిల్లాలో ధాన్యం నిల్వలకు టెండర్‌వేసినా, ఆ ధాన్యంలో సరిపడా వెనక్కి రాకపోవడంతో మిల్లర్లు జిల్లా నుంచి ఎగుమతికి బియ్యం అందించలేకపోయారు.ఈసారి ఎగుమతికి పాత నిబంధనలే కొనసాగిస్తారా? లేక మార్పులు చేస్తారా? అనే విషయం తేలాల్సి ఉంది. ఈ నిబంధనలు మార్చాలని,ఎగుమతుల విషయంలో ప్రభుత్వం అందరికీ అవకాశం కల్పించాలని మిల్లర్లు కోరుతున్నారు. టెండర్ ధాన్యం వసూలు చేయడంలో ప్రభుత్వానికి స్వేచ్ఛ, అధికారం ఉందని అదే సమయంలో ఎగుమతులకు వాటికి లంకె పెట్టడంతో కీలక ఎగుమతుల విషయంలో జిల్లా అవకాశం కోల్పోవాల్సి వస్తోందని అంటున్నారు. రాష్ట్రంలోనే అత్యధిక వరి దిగుబడితో పాటు అత్యంత నాణ్యమైన బియ్యం ఇక్కడ ఉత్పత్తి అవుతోందని, ఇలాంటి ప్రాంతంలో లభించే బియ్యాన్ని ఎగుమతి చేస్తే విదేశాల్లోనూ పేరువస్తుందని పేర్కొంటున్నారు. ఈ ఏడాది బియ్యం ఎగుమతి విషయంలో ప్రభుత్వం పునరాలోచించి అవకాశం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




నేడు వరలక్ష్మీ వ్రతం

శ్రావణమాసం మహిళలకు ప్రీతికరమైనది. ఈ మాసంలో వరలక్ష్మీ అమ్మవారిని కొలుస్తుంటారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలతో ఆలయాల్లో సందడి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్ర ముహూర్తం కావడంతో శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ మాసంలో రెండో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం ఆచరించడం ఆనవాయితీ. అందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి.

6

ఇసుకను సద్వినియోగం చేసుకోవాలి

తెలంగాణ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ భవిష్‌మిశ్రా



శాండ్ బజార్‌ను ప్రారంభిస్తున్న మైనింగ్ ఎండీ భవిష్ మిశ్రా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం శాండ్ బజార్ నుంచి సరఫరా చేస్తున్న ఇసుకను భవన నిర్మాణ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ మైనింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ భవిష్‌మిశ్రా అన్నారు. గురువారం మిర్యాలగూడ చింతపల్లి ఇందిరమ్మ కాలనీ ఎక్స్ రోడ్డులో ఏర్పాటు చేసిన శాండ్‌బజార్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాండ్‌బజార్ సైట్‌ను ఓపెన్ చేసి ఇసుకను బుక్ చేసుకోవచ్చని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో పాటు ఇతర వినియోగదారులు సైతం శాండ్‌బజార్ ఇసుకను వినియోగించుకోవచ్చని అన్నారు. ఇసుక అక్రమ దందాను అరికట్టి సామాన్యులకు అందుబాటు ధరలో ఇసుకను అందించడమే సాండ్‌బజార్ ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని అన్నారు. అందులో భాగంగానే సాండ్‌బజార్ ఏర్పాటు చేసి ఇసుకను తక్కువ ధరకు అందిస్తుందని తెలిపారు. సిమెంట్‌ను బస్తాకు రూ.50చొప్పున, ఇటుకలను మార్కెట్ ధర కంటే రూపాయి తక్కువగా అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మొదటి లబ్ధిదారునికి ఎమ్మెల్యే బీఎల్ఆర్ కాంటావేసి ట్రాక్టర్ నడిపి ఇసుక సరఫరా చేశారు. కార్యక్రమంలో మైనింగ్ ఏడీ జాకోబ్, తహసీల్దార్ సురేష్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్‌రెడ్డి, బాలు, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ఇక చౌక



మిర్యాలగూడలోని శాండ్‌బజార్

ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే ఇసుకను ఇసుక బజార్ ద్వారా పంపిణీకీ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎదురవుతున్న ఇసుక కొరత సమస్యను తీర్చి ప్రభుత్వ సంక్షేమ పథకాల లక్ష్యాన్ని పూర్తిస్థాయిలో నెరవేర్చేందుకు చర్యలు ప్రారంభించారు.
- (ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ)

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం సత్వర పూర్తికి శాండ్‌బజార్
- తక్కువ ధరలో తక్షణ సదుపాయం

ప్రభుత్వం నిరుపేదలకు గూడు కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. అందుకు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.5లక్షలు నిర్మాణాన్ని బట్టి దశల వారీగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తోంది. ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తున్నా, ఇంటి నిర్మాణానికి కావల్సిన ఇసుక, సిమెంట్ సకాలంలో అందక పనులు సకాలంలో పూర్తికావడం లేదనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఈ దశలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సరిపడా ఇసుకను సరఫరా చేసేందుకు అధికారులు మిర్యాలగూడలోని చింతపల్లి ఇందిరమ్మ కాలనీ క్రాస్‌రోడ్ వద్ద బైపాస్ సమీపంలోని నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిలో శాండ్‌బజార్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడి నుంచి చౌకగా ఇసుకను పంపిణీ చేయనున్నారు.

తక్కువ ధరకే ఇసుక...

ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసుకుంటే ఇంటికే రవాణా చేసేందుకు సుమారు రెండు నుంచి మూడు రోజులు పడుతోంది.దూరాన్ని బట్టి ట్రాక్టర్ ట్రక్కు ఇసుక ధర రూ.4వేల నుంచి రూ.5వేల వరకుఉంది. దీనికి తోడు ఇసుక నాణ్యతలోనూ తేడాలుంటున్నాయి. అర ట్రక్కు అవసరమైన చోట పూర్తి ట్రక్కును కొనుగోలు చేయాల్సి వస్తోంది. పేదలకు ఈ ఇబ్బందులు తొలగించి అవసరమైన మేర చౌకధరకు ఇసుక బజార్ల ద్వారా విక్రయించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. టన్ను ఇసుకను రూ.1230కే విక్రయిస్తున్నారు. ట్రక్కులో 3 టన్నుల ఇసుక రవాణా చేయవచ్చు. దీంతో ట్రక్కు ఇసుక రూ.3690కే లభిస్తుండటంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకునే వీలు కలుగుతుంది. మిర్యాలగూడ నియోజకవర్గంలోని పేదలకు తొలుత 3,500, వితంతు, దివ్యాంగులకు 1500, మొత్తం 5వేల ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. స్థానిక శాండ్‌బజార్ ద్వారా 5వేల మంది లబ్ధిదారులకు తక్షణ ప్రయోజనం చేకూరనుంది.

ఉమ్మడి జిల్లాలో ప్రథమం...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇసుక బజార్ ఏర్పాటులో మిర్యాలగూడలో ప్రథమం. రాష్ట్రంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో నాలుగు శాండ్ బజార్లు ఏర్పాటు చేసి విక్రయాలు నిర్వహిస్తున్నారు. అక్కడ టన్ను రూ.1600 చొప్పున విక్రయిస్తుండగా, మిర్యాలగూడలో మాత్రం టన్ను రూ.1230కే విక్రయిస్తున్నారు. ఇసుక చౌకగా లభిస్తుండటంతో ఇళ్ల నిర్మాణ యజమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శాండ్‌బజార్‌కు

- మిగతా 8వ పేజీలో...

జిల్లాలో జ్వర సర్వే

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి.

పెద్దఅడిశర్లపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా జ్వర సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం గుడిపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజులకు మించి జ్వరం వస్తుంటే వెంటనే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యకేంద్రంలోని వైద్యులు, సిబ్బంది, హాజరు రిజిస్టర్, ఓపీ రిజిస్టర్, మందుల స్టాక్ రిజిస్టర్ తదితర వాటిని పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆమె వెంట దేవరకొండ ఆర్డీవో వెంకటరమణారెడ్డి, జడ్పీ సీఈవో శ్రీనివాస్ రావు, ఎంపీడీవో చంద్రమౌళి ఉన్నారు.

స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించాలి

నల్లగొండ టౌన్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ నిర్వహణపై జిల్లా అధికారులతో సమీక్షించారు. వేడుకలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. ఆగస్టు 15న ఉదయం 9 గంటలకు పోలీస్ పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య వేడుకలు మొదలవుతాయని, ముఖ్యఅతిథి జాతీయ పతాకావిష్కరణ, వందన స్వీకరణ, సందేశం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాల ప్రదర్శన, స్టాల్స్ తదితరాలు ఉంటాయని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, ఇన్‌చార్జి డీఆర్వో వై.అశోక్‌రెడ్డి, డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింహవాహినీ దేవిగా ఎల్లమ్మతల్లి

ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



కనగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని అమ్మవారు భక్తులకు గురువారం సింహవాహినీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ ముఖ్య అర్చకులు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి శ్రీదేవి ఖడ్గమాల నామవాళితో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీర సారె ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

క్షయ వ్యాధిగ్రస్థులు పోషకాహారం తీసుకోవాలి

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్



టీబీ రోగులకు పోషకాహారాన్ని పంపిణీచేస్తున్న డీఎంహెచ్‌వో శ్రీనివాస్

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిగ్రస్థులు మందులతో పాటు పోషకాహారం తీసుకోవాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఐఎంఏ భవనంలో బంగారుగడ్డ, ప్రకాష్‌నగర్ అర్బన్ పీహెచ్‌సీల పరిధిలోని క్షయ(టీబీ) రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ కుటుంబ ఆరోగ్య సర్వేలో గుర్తించిన రోగులకు సమీప పీహెచ్‌సీల నుంచి ప్రతీ నెలా మందులు అందించనున్నట్లు తెలిపారు. టీబీ రోగులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తలు పోషకాహారం అందించడంతో తమ వంతు చేయూతనివ్వాలని కోరారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న టీబీ రోగుల ఆరోగ్యస్థితిని పరిశీలించి డాక్టర్ల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ఆరోగ్య సిబ్బంది తమ వంతు కృషి చేయాలని అన్నారు. డెంగ్యూ, విషజ్వరాల కేసులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం క్షయ రోగులకు పోషకాహార బుట్టలు అందించేందుకు ముందుకొచ్చిన బ్రౌస్, స్వధర్మ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను డీఎంహెచ్‌వో అభినందించారు. కార్యక్రమంలో క్షయ నిర్ధారణ జిల్లా అధికారి డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, వైద్యులు డాక్టర్ నిపుణ్, డాక్టర్ జానకిరాములు, సూపర్‌వైజర్లు ప్రమీల, సృజన, సోములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు ప్రోత్సాహం

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న చేనేత జౌళిశాఖ అధికారులు


నల్లగొండ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకుడు ద్వారక్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని గురువారం జిల్లా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులను సన్మానించారు. త్రిఫ్ట్ ఫండ్ హ్యాండ్లూమ్ పథకం కింద రూ. 29కోట్లు, పవర్ లూమ్ త్రిఫ్ట్ కింద రూ.11కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అభివృద్ధి అధికారి ప్రసాద్, సహాయ అభివృద్ధి అధికారులు గీతారాణి, గోపాల్, చేనేత సంఘం నాయకులు అంజనేయులు, నరసింహ పాల్గొన్నారు.

అనకాపల్లి టూ ఢిల్లీ

రెండు కార్లలో పట్టుబడిన 250కిలోల గంజాయి ● విలువ రూ.70లక్షలు

6

● వర్షం



జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ కూడలిలో కురుస్తున్న వర్షం

నల్లగొండ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. శాలిగౌరారంలో 13.6సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరి, పండ్ల తోటలు, పత్తి చేలకు ఈ వర్షం ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తుంది. వర్షాలకు పానగల్ కూడలి వద్ద భారీగా వరద నిలిచింది.

'భూభారతి' దరఖాస్తులను పరిశీలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ కలెక్టరేట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): భూభారతి అమలులో భాగంగా రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ఆ సమస్యలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. నల్లగొండ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో నల్లగొండ డివిజన్‌లో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో గురువారం భూభారతి రెవెన్యూ సదస్సులపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు, డీటీలు, ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

ముర్రుపాలతో శిశువులకు ఆరోగ్యం

జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి

చిట్యాలరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ముర్రుపాలతో శిశువులకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. చిట్యాల మండలం నేరడ, వనిపాకల గ్రామాల్లో గురువారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. పుట్టిన బిడ్డకు వెంటనే వచ్చే ముర్రుపాలలో ఉండే కొలస్ట్రీన్ పదార్థంతో బిడ్డకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని అన్నారు. తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని, రొమ్ము క్యాన్సర్ రాకుండా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, సిబ్బంది హేమ, విజయ, అలివేలు మంగ, సుజాత, జ్యోతి, నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల నూతన భవనాన్ని వెంటనే పూర్తి చేయాలి

దామరచర్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల భవ నిర్మాణాన్ని పూర్తి చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ శ్రీరామ్‌నాయక్ అన్నారు. గురువారం ఆయన నిర్మాణం లో ఉన్న పాఠశాల భవనాన్ని పరిశీలించి మాట్లాడారు. భవనానికి 2018లో శంకుస్థాపన చేశారని ఇప్పటివరకు పూర్తి చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయన వెంట రవినాయక్, వినోద్‌నాయక్, హనుమంతు ఉన్నారు.

సకాలంలో బస్సులు నడపాలి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డిపో పరిధిలోని రూట్లకు సకాలంలో బస్సులు నడపాలని, విద్యార్థులందరికీ ఉచిత బస్ పాసులు అందించాలని కోరుతూ ప్రోగ్రెసివ్ స్టూడెంట్ యూనియన్(పీఎస్‌యూ) ఆధ్వర్యంలో ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ మచ్చ వంశీ నాయకులు నల్లగంతుల అజయ్, సాయి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మోహన్‌రెడ్డి మృతి బాధాకరం

● శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



మోహన్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

దేవరకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మేపల్లి గ్రామ విశ్రాంత వీఆర్‌వో లోకసాని మోహన్‌రెడ్డి మృతి బాధాకరమని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. గురువారం గ్రామంలో మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. వీఆర్‌వోగా మోహన్‌రెడ్డి సేవ లు అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, వడ్త్యా దేవేందర్‌నాయక్, యుగేందర్, రమావత్ తుల్సానాయక్, రమావత్ శంకర్‌నాయక్, చింతపల్లి సతీష్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు.

వెంచర్ యజమానిపై చర్యలు తీసుకోవాలి

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రవీంద్రనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన వెంచర్‌లో అభివృద్ధి పనులు చేపట్టడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వెంచర్ యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాలనీవాసులు మునిసిపల్ కమిషనర్ శ్రీనివా‌స్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ10వ వార్డు రవీంద్రనగర్‌లో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంచర్‌లో రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, విద్యుత్ తదితర మౌ లిక వసతుల ఏర్పాటు చేస్తామని ప్లాట్లు విక్రయించారన్నారు. ఇప్పుడు అభివృద్ధి పనులేవీ చేయకుండా కొనుగోలుదారులను ఇబ్బంది పెడుతున్న యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వెంచర్‌కు సంబంధించిన మార్టిగేజ్ చేసిన స్థలాన్ని విడుదల చేయొద్దని కమిషనర్‌ను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎండీ. సాధిక్, రాములు, మధుకుమార్, మల్లికార్జునరెడ్డి, వీరయ్య, నాగార్జునరెడ్డి తదితరులున్నారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ది కపట ప్రేమ



సమావేశంలో మాట్లాడుతున్న పోగుల సైదులుగౌడ్

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీది కపట ప్రేమని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్ ఆరోపించారు. స్థానికంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణ, కార్పొరేట్ పదవుల కేటాయింపులో బీసీలపై సవతి తల్లి ప్రేమ చూపించిన హస్తం పార్టీ స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై మరో నాటకానికి తెరపై తేస్తుందన్నారు. పదేళ్ల రాష్ట్రాన్ని పాలించిన బీఆ ర్ఎస్ గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 27 శాతానికి కుదించిన సంగతి మర్చిపోయిందని ఎద్దేవా చేశారు. బీసీలు పార్టీలకు అతీతంగా ఏకమైతేనే రిజర్వేషన్ల సాధన సాధ్యమని హితవు పలికారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి కర్నాటి శివరామకృష్ణ, గేణగంటి వెంకన్న, వద్దిపట్ల వినోద్‌కుమార్, చింతపండు ఎల్లయ్య, కరుణాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సేవా రత్న నేషనల్ అవార్డుకు అమీర్‌అలీ ఫౌండేషన్ సభ్యుల ఎంపిక




జానిపాష, ఏడుకొండలు

హాలియా,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవ చేసే వారిని గుర్తించి వారిని ప్రోత్సహిస్తూ ఇచ్చే పురస్కారానికి అమీర్‌అలీ ఫౌండేషన్ సభ్యులు ఎంపిక య్యారు. ఫౌండేషన్‌కు చెందిన షేక్ జానీ పాషా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవా రత్న నేషన్ అవార్డు-2025, పి.ఏడుకొండలు భారత్ సేవరత్న నేషన్ అవార్డు అందుకోనున్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమీర్‌అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను మనం ఫౌండేషన్ వారి దృష్టికి తీసుకెళ్లిన కంబాల శివలీల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా.శివలీలకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

● విద్యా శాఖ కమిషన్ సభ్యుడు వెంకటేశ్వర్లు



జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న వెంకటేశ్వర్లు

చింతపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): సర్కారు పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్ జడ్పీ హెచ్ఎస్‌లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు భోజనం కల్పించేందుకు విద్యాశాఖ పని చేస్తుందన్నారు. ప్రైవేట్ దీటుగా ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రైవేట్ పాఠశాల్లో రూ. లక్షల ఫీజులు చెల్లించక ఇబ్బందులు పడవద్దన్నారు. విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటుఉత్తమ ఫలితాల కోసం ఆధ్యాపకులు చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాక్రమంలో హెచ్ఎం కృష్ణవేణి, ఆధ్యాపకులుఎండీ అన్వర్, వోలీ సుధీర్‌కుమార్, బాల్‌రెడ్డి, శివలీల, సౌజన్య, శ్రీవిద్య, మోతీలాల్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ అనంతరాజు గౌడ్ పరామర్శ

చింతపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని వింజమూర్ గ్రామానికి చెందిన బీనమోని మహేందర్ ఇటీవల పురుగుల మందు తాగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మర్రిగూడ మాజీ ఎంపీపీ అనంతరాజు గౌడ్ వింజమూర్‌లో నివాసం ఉంటున్న కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ మేరకు పిల్లలకు ధైర్యం కల్పించారు.

శివారు కాలనీలపై శీతకన్ను

● అభివృద్ధిపై దృష్టి సారించని పాలకులు

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతుండడంతో పట్టణ జనాభా రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో పట్టణ పరిధి కూడ విస్తరిస్తుంది. కానీ శివారు ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. పట్టణంలో 48వార్డులుండగా ఈదులగూడ, హైదలాపురం, తాళ్లగడ్డ, ఇందిరమ్మ కాలనీ, రవీంద్రనగర్, ఏడుకోట్లతండా తదితర కాలనీల్లో సమస్యలు కొట్టుమిట్టాడుతున్నాయి. అయా కాలనీల్లో నూతన నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ రహదారులు ఏర్పాటు చేయకపోవడం, తాగునీటి పైప్‌లైన్లు వేయకపోవడంతో రాకపోకలు సాగించడం కష్టంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అడవిని తలపించెలా పొదలు, పిచ్చి చెట్లు పెరడంతో క్రిమికీటకాలు ఇళ్లలోకి వస్తున్నాయని, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇక డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఒంపు ప్రాంతాలకు చేరుతోందని, అక్కడ కృడా వర్షపు నీరు నిలిచి బురదమయంగా మారగా అవస్థలు పడుతున్నామని, పాలకులు అధికారులు వార్డుల్ల పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



ఈదులగూడలో అధ్వానంగా ఉన్న ఓ వీధి

సమస్యల పరిష్కారానికి చర్యలు



పాలకవర్గం రద్దు కావడంతో అభివృద్ధి పనుల నిర్వహణలో కొంతమేర జాప్యం జరుగుతోంది. శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. అమృత్ నిధులతో పబ్లిక్ హెల్త్ శాఖ సహకారంతో పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ(యూజీడీ) పనులు జరుగుతున్నాయి. పనులు పూర్తయితే మురుగునీటి పారుదలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. చేయాల్సిన పనులను ఎప్పటికప్పుడు ప్రత్యేకాధికారి దృష్టికి తీసుకెళ్తున్నాం. - శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.



విద్యానగర్‌లో అడుగున్నర ఎత్తులో మ్యాన్‌హోల్

రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు

డిండి, తిరుమలగిరి(సాగర్), ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు రాయితీపై అందజేస్తున్నట్లు ఆయా మండలాల వ్యవసాయశాఖ అధికారులు రెహెనా, హర్షిత గురువారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ మహిళ రైతులకు 50 శాతం, ఇతరులకు 40 శాతం రాయితీతో పనిముట్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. డిండి మండలంలో ఎవర్‌న్యాప్ సాక్‌స్ప్రేయర్ జనరల్ 17, ఎస్సీ 4, ఎస్టీ 1, బ్యాటరీ, మ్యానువల్ ఆపరేటెడ్ స్ప్రే యర్ జనరల్ 131, ఎస్సీ 29, ఎస్టీ 12, రొటవేటర్ జనరల్ 8, ఎస్సీ 2, సీడ్‌కం ఫర్టిలైజర్ డ్రిల్ జనరల్ 2, ఎస్సీ 1, డిస్క్‌హెరో, కల్టివేటర్, ఎంబిప్లస్, తేజ్ జనరల్ 8, ఎస్సీ 2, ఫండ్ ఫార్మర్ నాన్ పీటీవో ఎస్టీ 2, ఫండ్ ఫార్మర్ పీటీవో ఎస్టీ -1, పవర్ వీడర్ జనరల్- 1, బ్రెష్‌కట్టర్ జనరల్ 2, ఎస్సీ 1, పవర్ టిల్లర్ జనరల్ -1, స్ట్రాబెలర్ జనరల్ 2, ఎస్సీ-1 ఉన్నట్లు ఆమె తెలిపారు. ఆసక్తిగల రైతులు దరఖాస్తు ఫారంపాటు పట్టాదార్ పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు బ్యాంక్ ఖాతా, ఆర్సీ జిరాక్స్ (ట్రాక్టర్ సంబంధిత పరికరాలకు మాత్రమే) జతచేసి ఆగస్టు 14వ తేదీ వరకు మండల వ్యవసాయశాఖ అధికారికి అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు వ్యవసాయ విస్తరణ అధికారులు, మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని కోరారు.

లింక్ రోడ్ల నిర్మాణానికి చర్యలు



జమ్మనకోట రోడ్డును పరిశీలిస్తున్న డీఈఈ సత్యానందం, స్థానిక కాంగ్రెస్ నాయకులు

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 7(ఆంధ్ర జ్యోతి): మం డలంలోని పలు గ్రామాల్లో లింక్ రోడ్ల నిర్మాణానికి అధికారు లు చర్యలు చేపట్టారు. మండలంలోని జమ్మన కోట నుంచి నాగార్జునసాగర్ పైలాన్‌కాలనీ వరకు 2 కి.మీ దూరాన్ని రూ.2 కోట్ల వ్యయంతో, సపావత్ తం డా నుంచి నాయకునితండా వరకు 1.8 కి.మీ దూరాన్ని 1.7 కోట్లతో, గోడుమడక నుంచి తునికినూతల వరకు 1.5 కి.మీ దూరాన్ని రూ.1.2 5కోట్ల వ్యయంతో రంగుండ్ల నుంచి లక్ష్మీపురం తండా వరకు 1.5కి.మీ దూరాన్ని రూ .1.25 కోట్లతో నిర్మించేందుకు ప్రతిపాదించినట్లు గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్యానందం తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి గురువారం రోడ్లను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో ఈ బీటీ రోడ్ల నిర్మాణాన్ని త్వరలో చేపట్టనున్నట్లు ఆయ ఎన తెలిపారు. మారుమూలతండాకు రోడ్డు సౌకర్యాన్ని కల్పించేందుకు ఎంతోకాలం నుంచి స్థానిక గిరిజనులు ఎదురు చూస్తున్నారని ఈ క్రమంలో ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి రోడ్ల నిర్మాణాలకు చొరవ తీసుకున్నట్లు కాంగ్రెస్ మండల నాయకులు మెరావత్ మునినాయక్, హచ్చునాయక్, శ్రీనునాయక్, బిక్కునాయక్, లాలునాయక్, దరావత్ హరినాయక్, పాండు, రంగా, రమావత్ ముని, లక్ష్యా, గణపతి, లక్పతి, రాములు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

జేవీవీ కన్వీనర్ డాక్టర్ ముప్వా రామారావు



మాట్లాడుతున్న జేవీవీ జాతీయ కన్వీనర్ డాక్టర్ ముప్వారామారావు

మిర్యాలగూడ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకున్నప్పుడే సామాజిక అభివృద్ధి సాధ్యమవుతుందని జనవిజ్ఞాన వేదిక జాతీయ కన్వీనర్ డాక్టర్ ముప్వా రామారావు అన్నా రు. మండలంలోని చిల్లేపల్లి మహాత్మా జ్యోతిబా పూలే మహిళా గురుకుల కళాశాలలో గురువారం భారత రాజ్యాంగం శాస్త్రీయ దృక్ప.దంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే శాస్త్రీ య పరిజ్ఞానాన్ని కలిగి ఉండేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. చిన్నచిన్న పరిశోధనల వైపు వారి దృష్టిని మళ్లించాలన్నారు. కళాశాల చదువుతో పాటు పాలనా వ్యవస్థను, రాజ్యాంగం, చట్టాలు, న్యాయ వ్యవస్థల పట్ల అవగాహన పెంపొందించుకోవాలని అన్నారు. తెలంగాణ విద్యా వికాస వ్యవస్థాపక కన్వీనర్ కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ రవీంద్రనాధ్ ఠాగూర్ కోరుకున్న అసమానతలు లేని సమాజంగా మారడానికి విద్యార్థులే దిక్సూచి అని అన్నారు. రవీంద్రనాధ్ ఠాగూర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు మనమిచ్చే నివాళి అన్నారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, ప్రిన్సిపాల్ కరుణ, వైస్ ప్రిన్సిపాల్ సుజాత, టీచర్స్ పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికతో సమస్యలు పరిష్కారం



అవగాహన కల్పిస్తున్న కమిషనర్ సుదర్శన్

దేవరకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీలో చేపడుతున్న వంద రోజుల పట్టణ ప్రణాళికతో వార్డుల్లో నెలకొన్న సమస్యలు ప రిష్కారమవుతున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుదర్శన్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, 20వ వార్డులో ప్రజలకు గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. వార్డుల్లో ప్రజలు తడి, పొడి చెత్త వేరుచేసి బుట్టలలో వేయాలన్నారు. మునిసిపల్ శాఖ ఆటోల్లో తడి, పొడి చెత్తలను విధిగా సేకరిస్తుందన్నారు. మునిసిపాలిటిలో రోడ్ల నిర్మాణాలు, పారిశుధ్య సమస్యను పట్టణ ప్రణాళికలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ శంకర్, శక్రునాయక్, ఏఈ రాజు, వార్డుల ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

దేవరకొండలో ముసురుతో కూడిన వర్షం



దేవరకొండలో కురుస్తున్న వర్షం

దేవరకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంతోపాటు మండలంలోని గ్రా మాల్లో గురువారం సాయంత్రం ముసురుతో కూడిన వర్షం కురుస్తోంది. వానాకాలం అయినప్పటికీ వారం రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పత్తిపంట ఎండేదశకు చేరుకోగా ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో ప్రాణం పోసినట్లయ్యింది. వర్షానికి దేవరకొండ పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



దేవరకొండఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

దేవరకొండ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర పిలుపు మేరకు గురువారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి దేవరకొండ మండల విద్యా వనరుల కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడా రు. మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ. 10వేల చొప్పున వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వెంకట్రాములు, సంఘం జిల్లా అధ్యక్షురాలు జంపాల జంగమ్మ, మల్లయ్య, ధనలక్ష్మి, సైదమ్మ, శోభరాణి పాల్గొన్నారు.

రూ.10వేల వేతనం చెల్లించాలి

డిండి : మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకు నెలకు రూ.10వేలు వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 ఏళ్లుగా కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బూషిపాక లింగమయ్య, రమావత్ జవహర్‌లాల్, బలుమూరి లక్ష్మయ్య, సిగ అలివేలు, బూషిపాక తబిత, ఎల్లమ్మ, వెంకటమ్మ, పద్మ, జంగమ్మ, రాములమ్మ పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుడి ముందస్తు అరెస్ట్

పెద్దవూర :మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం హైదరాబాద్ విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు వెళ్తున్న సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్‌కె.బషీర్‌ను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని, రూ.10వేల వేతనం అందిస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు.

● మాడ్గులపల్లి: హైదరాబాద్‌లోని విద్యా కమిషనర్ కార్యాలయ ముట్టడికి వెళ్తున్న మండల మధ్యాహ్న భోజన కార్మికులను, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రొండి శ్రీనివా‌స్‌ను గురువారం పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో రేణుక, సైదమ్మ, యాదమ్మ ఉన్నారు.



మాడ్గులపల్లిలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఇసుక ఇక చౌక

(5వ పేజీ తరువాయి)

అనుసంధానంగా వేబ్రిడ్జితోపాటు ఆన్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో సాండ్ బజార్ సైట్ ద్వారా ఇసుకను బుక్ చేసుకునే వీలు కల్పించారు.

సిమెంట్‌ను కూడా తక్కువ ధరకే

ఇళ్ల నిర్మాణంలో ఇసుక తరువాత ఎక్కువగా వినియోగించే సిమెంట్‌ను సైతం తక్కువ ధరకే అందించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్ చొరవచూపి మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని అదానీ, అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీల ప్రతినిధులతో మూడురోజుల క్రితం సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రొడక్ట్ కాస్ట్, ట్రాన్స్‌పోర్ట్ చార్జీల మేరకే సిమెంట్ సరఫరా చేయాలని రిక్విజేషన్ లెటర్స్ ఇచ్చారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం 5000 ఇందిరమ్మ ఇళ్లకు సిమెంట్‌ను సైతం పేదలకు అనుకూల ధరలో లభ్యమయ్యేలా విధంగా చూడాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం సిమెంట్ బస్తా ధర రూ.350కి విక్రయిస్తుండగా ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం ఉత్పత్తి ధర, రవాణా చార్జీలతో కలిపి ఇందిరమ్మ లబ్ధిదారులకు రూ.300 లోపు ధరకు సరఫరా చేయాలని కోరినట్లు తెలిసింది. ఒక్కో ఇంటికి 225 బస్తాల సిమెంట్ అవసరమని ఇంజనీర్లు అంచనా వేశారు. దీంతో పట్టణంలోని 5,000 ఇళ్లకు సరిపడా సిమెంట్ బస్తాలను సరఫరా చేసేలా యాజమాన్యలతో మాట్లాడి సాధ్యమైనంత తొందరగా సానుకూల నిర్ణయం తీసుకునేలా చూడాలని సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులను కోరినట్లు సమాచారం. సిమెంటు బస్తాలను అన్ని మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచి ఏఈల ద్వారా లబ్ధిదారులకు అవసరమైన మేరకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిసింది.

ఒంటిపై పెట్రోల్‌పోసుకుని హమాలీ ఆత్మహత్యాయత్నం

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఒంటిపై పెట్రోల్ పోసుకుని హమాలీ ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలో గురువారం జరిగింది. రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుబ్బతండాకు చెందిన ధనావత్ రమేష్ శ్రీనివాసనగర్ పరిధిలోని వేణుగోపాలస్వామి గోడౌన్‌లో హమాలీగా పనిచేస్తున్నాడు. ఉదయం పనికి ఆలస్యంగా హాజరైన రమేష్‌తో తోటి కార్మికులు వాగ్వాదానికి దిగారు. దీంతో మనస్తాపంతో చెందిన రమేష్ గోడౌన్ పార్కింగ్ స్థలంలోని తన ద్విచక్ర వాహనం నుంచి బాటిల్‌లో పెట్రోల్‌తీసి ఒంటిపైజల్లుకొని నిప్పంటించుకున్నాడు. దీన్ని గమనించిన గోడౌన్ యాజమాన్యం, తోటి హమాలీలు రమేష్‌ను చికిత్స నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమచికిత్స అనంతరం డాక్టర్ల సలహా మేరకు బంధువులు అతడి మెరుగైన వైద్యం కోసం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. కార్మికుడి కుటుంబసభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యభిచారగృహంపై పోలీసులదాడి

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివారులోని ఓ కాలనీలో వ్యభిచార గృహంపై బుధవారం రాత్రి రూరల్ పోలీసులు దాడి చేశారు కొంతకాలంగా పట్టణానికి చెందిన కొందరు వ్యక్తులు పట్టణ శివారు ప్రాంతం, రూరల్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిని అద్దెకు తీసుకొని వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుగా సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టారు. తనిఖీలో ముగ్గురు విటులతోపాటు ఇద్దరు మహిళలు పట్టుబడగా వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.